## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

నిరంతర వార్తా ప్రవాహం

# జనసముద్రం న్యూస్

ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి:04 | సంచిక:353 | మంగళవారం జూలై 28, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00


# ఎల్‌నినో ప్రభావంపై

## రైతుల్లో అవగాహన కల్పించాలి: సీఎం చంద్రబాబు

### రైతుల్లో ఎల్‌నినో అవగాహనకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు

- పంటల బీమా యాక్షన్ ప్లాన్ సమర్థవంత అమలు
- ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగుల పనితీరు మార్పు
- విద్యార్థులకు సైకోమెట్రిక్ టెస్టులు, ఉపాధ్యాయులకు శిక్షణ
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు






రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి విభిన్న శాఖల పనితీరుపై ఆయన సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులను చైతన్యపరిచేందుకు క్యాంపెయిన్ మోడ్‌లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఎల్‌నినో వల్ల కలిగే పరిణామాలను వివరిస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని, ఏ ప్రాంతంలో ఏయే పంటలు వేయాలో రైతులకు స్పష్టతనివ్వాలని తెలిపారు.

**ఉద్యోగుల పనితీరు మారాలి**

మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ సేవల అందజేతలో కొంత వ్యత్యాసం ఉందని పేర్కొన్న ముఖ్యమంత్రి, ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగుల పనితీరు మారాలని స్పష్టం చేశారు. ఆలూరు నియోజకవర్గ పర్యటన సందర్భంగా క్షేత్రస్థాయిలో ఉద్యోగుల తీరుపై ప్రజల నుంచి వచ్చిన ప్రతిస్పందనను అధికారులకు వివరించారు. అదేవిధంగా పంటల బీమా యాక్షన్ ప్లాన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. పేజి 2లో ▶

## రెండు వారాల్లోగా నివేదిక సమర్పించండి:

### అయోధ్య విరాళాల చోరీపై సుప్రీం



2లో

- అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ వ్యవహారానికి సంబంధించిన కేసు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది.

## ఆ నియామకాలు చెల్లవ్..

### విజయ్ సర్కార్‌కు హైకోర్టులో షాక్



2లో

- కరూర్ బాధితులకు ఇచ్చిన ఉద్యోగాలు చెల్లవ్: హైకోర్టు
- ప్రభుత్వ ఉద్యోగాలు నిబంధనల ప్రకారమే ఇవ్వాలి
- ఉద్యోగాలు ఉచితంగా పంచిపెట్టేవి కావు: కోర్టు
- విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ
- 32 మందికి ఇచ్చిన తాత్కాలిక నియామకాలు రద్దు

## కుప్పం అభివృద్ధికి

### సీఎం చంద్రబాబు కృషి: నారా భువనేశ్వరి

- రామకుప్పం మండలంలో నారా భువనేశ్వరి ముఖాముఖి
- తాండాలకు రూ.75 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం
- ఒకేసారి 30 పరిశ్రమల ద్వారా వేలమందికి ఉపాధి
- మహిళలు నైపుణ్య శిక్షణ ద్వారా ఎదగాలి
- కృష్ణా జలాలతో నెరవేరిన దశాబ్దాల తాగునీటి కల

2లో





### డీఎస్సీపై బహిరంగ చర్చకు సిద్ధం..

## జగన్‌కు లోకేశ్ సవాల్

కంకిపాడు: వైకాపా అధ్యక్షుడు జగన్‌కు మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. డీఎస్సీ అంశంలో జగన్ చేస్తున్న ఆరోపణలపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. వైకాపా హయాంలో జరిగిన మద్యం, భూకుంభకోణాల పైనా చర్చిద్దామన్నారు. కృష్ణా జిల్లా కంకిపాడులో తెదేపా నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో లోకేశ్ మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం తెదేపా సిద్ధాంతమని.. విధ్వంసం, అసభ్య పదజాలమే గొడ్డలి పార్టీ విధానమని ఎద్దేవా చేశారు.

## అర్హులందరికి సంక్షేమ పథకాలు

- రెండేళ్ల పాలనలపై ప్రచారంలో మంత్రి అనిత



అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేట మండలం పాల్మన్ పేటలో 'రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. కరపత్రాలు పంచారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం సమ ప్రాధాన్యంతో సాగుతున్నాయని వివరించారు. యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి చిరునామాగా మారుతుందని చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గం పరిశ్రమలకు పర్యాటక రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మారుస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్,పెద్దిరెడ్డి చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు

### ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పథకం ప్రారంభిస్తున్నాం



- విద్యార్థుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం
- అల్పాహార పథకాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి

తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకాన్ని ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకరమైన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి పేర్కొన్నారు. ఖాళీ కడుపుతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారని, వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్న డిప్యూటీ సీఎం.. మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు.

పేజి 2లో ▶

### మాజీ ఎమ్మెల్యే పెద్దికి

## కెసిఆర్ పరామర్శ



ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మాజీ సిఎం

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించేందుకు ఎర్రవెల్లిలోని నివాసం నుండి బయలుదేరి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి చేరుకున్నారు. కేసీఆర్ యశోద ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. పేజి 2లో ▶

# సంపాదకీయం

## సామాజిక విపత్తులతో సంఘర్షణే నా రచన!

జూపాక సుభద్ర సాహిత్యంలో చండాలిక! మారుమూల గ్రామం నుంచి తెలుగు సాహిత్యంలోకి దూసుకొచ్చిన పల్లె చుక్క. సంపద్వంతమైన తెలంగాణ జీవభాషతో తెలుగు సారస్వతానికి సొగసులద్దిన విద్వత్తేజం. మెరుపుల ముక్కు పుల్లలు పోగొట్టుకున్న అవ్వల, అక్కల, బిడ్డెల నేలలో నిత్య సాంస్కృతికాన్వేషి. చరిత్ర యాదుల భద్రాక్షరి. తెలుగు సాహిత్యంలో కడ మనుషుల జీవన సౌందర్యాలను గునుగుపూలై పూసిన తెలంగాణి. అట్టడుగు నుంచి అధికారి దాకా ఎదిగిన తన ఆత్మకథనమ్ 'గునుగుపూలు' విడుదలైన సందర్భంగా ఆమెతో సంభాషణ.

నాకు అక్షర జ్ఞానం అందిన కాన్నుంచి ఎటు చూసినా, ఏమి చదివినా మాది గాని భాషలో, మావి కాని జీవితాలు కవిత్వంగా, కథలుగా, నవల్లుగా, నాటకాలుగా, నాట్యాలుగా, గాత్రాలుగా, మా చుట్టూతా ఆవరించి వున్నయి. సమాజంలో చూస్తే, శ్రామిక జాతులు బహుళంగా ఉన్నాయి, కొన్ని విశ్రాంతి జాతులున్నాయి. సమాజంలో నానాజాతి సమూహాలున్నా విశ్రాంతి జాతుల చరిత్రలు, సాహిత్యాలు, కళలు, వారి ఆచార సంప్రదాయాలనే తిప్పించి, మల్లిచ్చి వాటినే సాహిత్యాలు, కళలు, చరిత్రలుగా చెబుతున్నాయి, రాస్తున్నాయి, ప్రచారం చేస్తున్నాయి. ఆ విశ్రాంతి జాతులు ఎంతగా మాయ చేస్తున్నారంటే, మా సాహిత్యాలు, కళలు, చరిత్రల నుంచి మేము పరాయీకరణ చెందేట్టుగా. శ్రమజాతుల్లో కూడా అట్టడుగు, అంటరాని జాతులు ఎట్లా బతికినయి? వారి ఆచార సంప్రదాయాలు, పుట్టుకలు, పురుల్లు, మందు మాకులు, పెండ్లి పేరంటాలు, ఆటలు, పని పాటలు.... ఇవేవీ 'మెయిన్ స్ట్రీమ్ చరిత్ర' చెంపకానలే. సాహిత్యాల సరసకు చేరలే. ఈ దేశంలో నేనెవరినీ...? నేను నడిచొచ్చిన దారుల్ని, యెదిగొచ్చిన యెన్నెలని, సాహితీ లోకానికి బొమ్మకట్టి పటమేసిన నా ఆత్మకథనమే 'గునుగుపూలు'.

**మీ సాహిత్యంలో అట్టడుగు కుల, జెండర్ జీవితాలకు కనిపించే ప్రాధ్యాన్యతకు నేపథ్యం?**

నా జీవితం -- సాహిత్యం వేరువేరు కావు. నా సాహిత్యానికి నా అనుభవాలే ప్రమాణం. ఎనుకటి ఏడు తరాల్లో, ముందు మూడు తరాల్లో బూములు, చదువులు, ఉద్యోగాలు, బతుకు దెరువు లేని, అంటరాని, ఎట్టి మాదిగ మహిళను. కుండలు, దొంతులు, బోకెలు, సిప్పలు దప్పా, కన్ను బొడుసుకున్నా, కాయితమ్ముక్క కనబడని యిలవరసలున్న ఇల్లు మాది. నా ఎండా కాలం నీటి బుడగ లాంటి చదువుకు, ఏ సన్నగాలి సకిలించినా, మటాష్. నా చదువు ఆగకుండా, ఆఖరి దాకా సాగడం అద్భుతమే. నా పూర్తి జీవితం ఉద్యమాల్లోనే అమరత్వం అనుకుంటే, ప్రభుత్వ పాలనా వ్యవస్థలు నడిపే ఆఫీసరమ్మ నైతానని, వీటన్నింటి కంటే, కవయిత్రిని, రచయిత్రినవుతానని అవ్వ తోడు ఏనాడూ కలగనని కత.

భారత సామాజిక ఉత్పత్తి రంగంలో శ్రమశక్తిగా వున్నదంతా బహుజన కులాల మహిళలే. రోడ్లు ఊడ్చే మునిసిపల్ వర్కర్స్, కక్కోసులు కడిగే సఫాయి కార్మికులు, ఇండ్లల్లో పని మనుషులు, కులం పేరుతో లైంగిక వెట్టికి గురయ్యే జోగినీలు, వ్యవసాయ కూలీలు, అడ్డా కూలీలు, తట్టలు మోసే లేబర్ పనోళ్ళు, మట్టి పనోల్లు, అసంఘటిత రంగాల్లో గౌరవం, ఆర్థిక విలువ లేని హీన రూపాలుగా చూడబడుతున్న శ్రమల్లో, మార్జినలైజ్ చేయబడిన మహిళలు నా రచనా వస్తువులు. నా జీవితం చుట్టూ కుల, జెండర్ వివక్షలు, అణచివేతలను ప్రతిఘటిస్తున్న పరిస్థితులు, మనుషులే నా సాహిత్య వస్తువులయ్యాయి.

**రచయిత్రిగా ఎదిగే క్రమంలో ఏమైనా అవాంతరాలు?**

జీవితంలో నిరాటంకంగా చదివినాను, ఉన్నతోద్యోగిగా ఎదిగినాను, రచయిత్రిగా నిలబడినానంటే, ఇదంతా నా ఒక్కదాని వల్లే జరగలేదు, చాలామంది నా వెనుక నిలబడ్డారు. వాళ్లంతా నాకు సదా యాదులు. కులం, జెండర్ నిరంతర వివక్షలు, అణచివేతలు నాకు మానని గాయాలు. ఆ గాయాల అనుభవాలను చెప్పుకోవడం, రాతల్లో వ్యక్తం కానివ్వడం, ఈ దేశంలో అంత సులువు కాదు. తెలుగు సాహిత్య చరిత్రలో మాదిగ మహిళ అస్తిత్వ గొంతు బలంగా కనిపించదు. నేను ఉద్యోగినైనపుడు, దళిత ఉద్యోగినని నా సర్టిఫికెట్ పత్రాల వల్ల తెలిసినా ఉద్యోగ సమాజం ఆ విషయాన్ని బాహ్యంగా ప్రస్తావించదు కానీ, సాహిత్య సమాజం మాత్రం 'దళిత రచయిత్రి'నని నా సామాజిక పరిధిని తగ్గిస్తుంది! ప్రపంచ రచనా ప్రస్థానంలో నేనూ, నా అస్తిత్వం లేదనే వేదన చాలా కుంగదీస్తుంది. సామాజిక ధర్మాగ్రహం తెప్పిస్తుంది.

నోటి సాహిత్యమే గాని, రాత సాహిత్యానికి వందల మైళ్ళ దూరంగా వున్న జాంబవ సమాజం నుంచి వచ్చిన రచయిత్రిని. అందుబాటులో వున్న సాహిత్యాన్ని చదవడమే గాక, నేను అధ్యయనంలో మునగడానికి ఎన్నెన్నో అసాధారణ పరిస్థితులు పురికొల్పినయి. సాహిత్యమంటే, ప్రయోజనాలంటే ఏమిటో తెలియని అవస్థ! నిజానికి అధ్యయనాన్ని మించి-- నేనెవరిని? నా సామాజిక జెండర్ స్థితి ఏమిటి? అనే వాస్తవిక అనుభవాలే నాకు ప్రశ్నించేటట్లు నేర్పినయి. సామాజిక విపత్తులతో సంఘర్షణలే నా రచనలు. వీటిని మెచ్చుకొని, మెడల మీద వేసుకుని, ప్రోత్సహించిన పత్రికలు లేకుండె. బాగా లేవనీ, నాసిరకం రచనలనీ, అర్థం కాని భాషనీ అచ్చుకు నిరాకరించిన, నిరుత్సాహపరిచిన నీరసాలే చాలా కాలమ్ వెంబడించినయి. తర్వాత్తర్వాత నా రచనలకు దొరికిన ప్రోత్సాహాలు మర్చిపోలేనివి.

ప్రత్యేకంగా తెలంగాణ తెలుగులో రాసే మీ రచనల్లో భాషా సమస్యలు?

చాలామంది "మీ భాష మార్చండి, చదువుకున్నారు కదా, చదువుకున్న భాషలో రాయండి. మీ తెలంగాణ అర్థం కావట్లేదు. మీ సాహిత్యం విస్తృతంగా అందరికీ అందాలంటే, తెలంగాణ మాండలికంలో కన్నా, మెయిన్ స్ట్రీమ్ తెలుగులో రాయండి" అనేవారు. భాష, బతుకు వేరు వేరు ఉండవు. పాలేరు భూస్వామి భాష మాట్లాడగలడా? అటెండర్‌కు ఆఫీసరు భాష అంటుతుందా? బాంచ భాష, బాసు భాష జమీన్ ఆస్మాన్ ఫరకు! భాషకు కులం, మతం, ప్రాంతం, జెండర్, చిన్న, పెద్ద, ధనిక, పేద ఉంటాయి. బూతులు ఉన్నాయని, అర్థం కావని, మా రచనలను చీకటి చేసింది ఆంధ్ర ఆధిపత్య మెయిన్‌స్ట్రీమ్ సాహిత్యం. ఆశ్చర్యమేంటంటే, తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నంక తెలంగాణ శిష్టులు "మీ పల్లె భాషని మార్చుకోండి ఎవరికర్తమైతది? శిష్ట తెలంగాణ వ్యవహారికం రాయండి" శిష్టభాష అనడంలోనే కులం ఉంది. ఇప్పుడు గూగుల్, ఏఐ టెక్నాలజీలు వచ్చాక కూడా భాష మీద కులమే అధిపత్యం చేస్తున్నది. 'చెప్పు' అని అడిగితే పాదరక్ష అని జవాబిస్తది ఏఐ. తెలంగాణ మాండలిక పదాలు గూగుల్, ఏఐ లలో ఉండకపోవడం కూడా మా భాష మీద జరుగుతున్న కులవివక్షే! మా తెలంగాణ మట్టి భాషని ఒకవైపు ఆధిపత్య భాషా సంస్కృతులు అడ్డుకుంటుంటే, ఇప్పుడు టెక్నాలజీ అడ్డుకుంటున్నది. భాషా వివక్ష చావలేదు. ఆ వివక్ష డిజిటలైజ్ అయింది.

మొదటి కథ 'శుద్ధి చెయ్యాలె' నుంచీ, ఇప్పుడు 'గునుగుపూలు' ఆత్మకథనమ్ వరకూ సాగిన మీ సాహిత్య ప్రస్థానం గురించి?

ప్రభుత్వ కళాశాలలో పాఠాలు చెబుతున్న కాలంలో, నా కులమేమిటో తెలిసి అద్దింటి యజమాని, నా సామాన్లు బైట పడేయించిన అవమానం నన్ను తీవ్రంగా గాయపరిచిన కథే 'శుద్ధి చెయ్యాలె'. పైటలు తగలేయాలనీ నినదిస్తుంటే, శ్రమ మహిళలకు కొంగు బొచ్చె మీద కావలి వుండదని అది సర్వ శ్రమలు చేస్తుందనీ, డప్పు తయారీలో మాదిగ మహిళ లున్నా దాన్ని వాయించే కాడ నిషేధాలున్న కవిత్వమే 'అయ్యయ్యో దమ్మక్క' సంపుటి. మా జీవితాలను బయటివారు రాసే కంటే, ఎవరి గాయాల లోతులను వారు రచనల ద్వారా వ్యక్తం చేయడమే సరైనదని అంబేద్కర్ ఉద్య మాల ద్వారా వచ్చిన చైతన్యంతో, నా స్వీయ అనుభవాలు, నా చుట్టూత అల్లుకున్న అట్టడుగు మనుషుల జీవితానుభవాలతో వచ్చిందే 'రాయక్క మాన్యెం' (కథల సంపుటి). ఇంకా 'చరిత్రల్ని చెరిగిపోస్తూ..' (సాహిత్య విమర్శ వ్యాసాల సంపుటి), 'రిజర్వేషన్ బోగి' (కథల సంపుటి), 'తెలంగాణి' (కవిత్వ సంపుటి) లను వెలువరించాను. 'మాక్క ముక్కుపుల్ల గీన్నె పోయింది' (120 కాలిక వ్యాసాలు), 'పంచాయితీరాజ్‌లో దళిత మహిళలు' (కథలు), 'ఒక్కొక్క పువ్వేసి...' (బహుజన మహిళా చరిత్రల కాలిక వ్యాసాలు)... నా యీ రచనలన్నీ అణగారిన జెండర్ల ఆధిపత్యకుల వ్యవస్థలతో జరిపిన సంఘర్షణలు, సంభాషణలు, సవాళ్లు.

ఇక నేను తిరిగి, పెరిగిన నేల నెలవుల్ల చీకట్లు, వానలు, బురద, ముండ్లు, రాళ్ళు రప్పలు, అగడ్తలు దాటి వచ్చిన దారులు; నా సమాజం ఎదుర్కొంటున్న సంకుటాల నుంచి, సెప్పుల్లేని సెమట అడుగుల నుంచి చదువులతో ఎదిగి, సెక్రటేరియట్‌లో కొలువుల అందలాలు; నడిచొచ్చిన నా కాలాన్ని, ప్రాంతాన్ని, సామాజిక, జెండర్ అక్షరీకరించిన బతుకు చిత్రాలు నా 'గునుగుపూలు'. అమాసలు పున్నాలు కలిసి ఆడుకున్న ఆటల్ని, ఆపదల్ని తవ్విపోసుకున్న తంగేళ్లు నా ఆత్మకథనం 'గునుగు పూలు'.

## ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించడం చిన్న విషయం కాదని, ఇది దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా అరుదైన కార్యక్రమమని వ్యాఖ్యానించారు. ఈ పథకాన్ని రాబోయే మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విస్తరిస్తామని తెలిపారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందించేలా మెనూను రూపొందించామని వెల్లడించారు. పాలన అంటే అధికారం చెలాయించడం కాదని.. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన పాలన అని భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందించిన సమయంలో వారి కళ్లలో కనిపించిన ఆనందమే ప్రభుత్వ పనితీరుకు నిజమైన గుర్తింపు అన్నారు. మధిర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాటిని పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను ఇప్పుడు అమలు చేస్తున్నామని చెప్పారు. రైతుల ఖాతాల్లో తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేశామని, మహిళలకు ప్రతి ఏడాది రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని వెల్లడించారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా అభివర్ణించడం సరైంది కాదని.. అలా మాట్లాడేవారు పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యానిస్తున్నారని భట్టి విమర్శించారు. మధిర ప్రజలు తనను గెలిపించడంతోనే కాంగ్రెస్ పార్టీ తనకు డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అల్పాహార పథకం కేవలం మధిర నియోజకవర్గానికే పరిమితం కాదని, తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం

### రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు: ఆర్ఎస్

హైదరాబాద్,జూలై27: వరుస వివాదాల నేపథ్యంలో హైకోర్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలని చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేయడంపై బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. ఇది ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. రంగనాథ్ మీదున్న 63 కోర్టు ధిక్కరణలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఉన్నత న్యాయ స్థానం ఇన్ని ఉల్లంఘలనకు పాల్పడుతున్న అధికారిని ఇంకా కొనసాగిస్తే రూల్ ఆఫ్ లా అదుపు తప్పుతుందని, రంగనాథ్ స్థానంలో ఐజీ స్థాయి అధికారిని నియమించాలని హైకోర్టు తెలిపిందన్నరు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంపదెబ్బలాంటిదన్నారు. రేవంత్ రెడ్డికి ఏ మాత్రం కూడా తెలంగాణను పరిపాలించే నైతిక అర్హత లేదని ఇవాళ హైకోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా తేలిపోయింది. లక్షమంది పోలీసులున్న ఈ రాష్ట్రంలో హోంమంత్రి అయిన సిఎం హైకోర్టు స్థానిక పోలీసులెవరూ కూడా తెలంగాణ ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడలేరు. అందుకు ఆర్మీ అధికారులను ఆదేశించింది.. అంటే అసలు మీకు ఇక నైతిక హక్కు ఎక్కుడుందని ప్రశ్నించారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేతల ప్రభుత్వం. విధ్వంసకర ప్రభుత్వం. లగచర్లలో, వెలుగుమట్లలో నాశనం చేశారు. సున్నం చెరువు పేరుతో, బహదూర్ గూడ పేరుతో, లోతుకుంటలో ఎక్కడ చూసినా విధ్వంసమే. ఆ విధ్వంసం చేస్తూనే మరోవైపు పేదల భూములను మీ సొంత సోదరులు, మీ కాంగ్రెస్ పార్టీ నాయకులంతా కబ్జాలు చేస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. హైడ్రాను అడ్డం పెట్టుకుని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూభారతి పోర్టల్‌ను తీసుకొని దొడ్డి దారిన దాదాపు 22 వేల ఎకరాల భూముల హక్కులను రాత్రికి రాత్రే ఎమ్మార్వో, ఆర్డీవోల సంతకాలు
లేకుండా బదలాయించారు. అందుకే నేను గతంలో తెలంగాణ ప్రభుత్వంలో పనిచేసిన మీ అధికారిగా, సోదరుడిగా, ప్రభుత్వ అధికారులకు చెబుతున్నా దయచేసి రాజ్యాంగాన్ని పాటించండి. చట్టాన్ని పాటించండి.. కోర్టులు ఇచ్చిన ఆదేశాలను దయచేసి అతిక్రమించకండని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు.

## విదేశీ యువతి పట్ల అసభ్య ప్రవర్తన


### హైదరాబాద్ టెక్కీపై పోలీసుల కేసు నమోదు

హైదరాబాద్,జూలై27: కొండాపూర్ ప్రాంతంలో విదేశీ యువతి పట్ల ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన వెలుగులోకి వచ్చింది. నెదర్లాండ్స్‌కు చెందిన యువతి తన బాయ్‌ఫ్రెండ్‌ను కలిసేందుకు మార్చి నెలలో భారత్‌కు వచ్చింది. ఆయువతి.. తన బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి నివసిస్తుండగా, అదే ఇంట్లో మరో యువకుడు ఆదిత్య ఆనంద్ ఉంటున్నాడు. అతడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బాయ్‌ఫ్రెండ్ ఇంట్లో లేని సమయంలో ఆదిత్య ఆనంద్ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడని నెదర్లాండ్స్ యువతి ఆరోపణలు చేసింది. యువకుడి చేష్టలతో విసిగిపోయిన యువతి.. భారత్ నుంచి తిరిగి నెదర్లాండ్స్‌కు వెళ్లి అక్కడి ఎంబసీకి ఫిర్యాదు చేసింది. మూడు రోజుల క్రితం యువతి తిరిగి హైదరాబాద్‌కు వచ్చింది. జరిగిన విషయాలన్నింటినీ గచ్చిబౌలి పోలీసులకు వివరించింది. యువతి ఫిర్యాదు ఆధారంగా ఆదిత్య ఆనంద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ప్రస్తుతం యువకుడు పరారీలో ఉన్నాడు. యువకుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## విద్యార్థిని శివాని ఆత్మహత్యపై చంద్రబాబు షాక్

### తీవ్రంగా కలచివేసిందంటూ ఎక్స్‌లో పోస్ట్

అమరావతి,జూలై27: పోలవరం జిల్లా ఈర్లపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థిని ముర్రం శివాని



ఆత్మహత్య చేసుకోవడంపై ఏపీ సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మెగా పీటీఎంలో ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన విద్యార్థిని మృతి తనను కలచివేస్తోందన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. పదో తరగతి విద్యార్థిని ముర్రం శివాని తనువు చాలించడం నన్ను తీవ్ర విషాదంలోకి నెట్టేసింది. రంపచోడవరంలో నిర్వహించిన మెగా పీటీఎంలో వేదికపై ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన విద్యార్థిని బలవన్మరణం ఆవేదన కలిగించింది. ఆరోజు తన చదువు, ఉన్నత లక్ష్యాల గురించి శివాని నాతో చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. ఎంతో భవిష్యత్ ఉన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరం. కారణాలు ఏవైనా తన కలలు నిజం కాకుండానే ఆ విద్యార్థిని దూరమవడం కలచివేస్తోంది. శివాని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించాను. సమస్యలు, కష్టాలు వచ్చినా విద్యార్థులు, యువత ధైర్యంగా నిలబడాలి. ఎవరూ ఒత్తిడి, నిరాశ, నిస్పృహలకు లోను కావొద్దు. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. మీ బాధ, ఆవేదనను కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆత్మీయులతో పంచుకోండి. ఒత్తిడిని అధిగమించి మీ కలలను నిజం చేసుకునేలా ముందుకు సాగండి. ప్రభుత్వం అన్ని విధాలుగా మీకు అండగా ఉంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. రంపచోడవరం మెగా పీటీఎంలో ఎంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడిన శివాని మృతి తీవ్ర విషాదాన్ని నింపిందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'విషయం తెలిసినప్పటి నుంచి శివాని మాటలు పదేపదే గుర్తొస్తున్నాయి. సోదరి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. ఎంత కష్టమైనా పోరాడుదాం.. ఎంతటి సమస్యనైనా ఎదుర్కొందాం.. మీకు నేనున్నాను.. ఈ ప్రభుత్వం ఉందని లోకేశ్ పేర్కొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంపై

### రైతుల్లో అవగాహన కల్పించాలి: సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

**విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై దృష్టి**

రంపచోడవరంలో విద్యార్థిని శివాని ఆత్మహత్యకు పాల్పడటం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిస్థితులను అంచనా వేసేందుకు సైకోమెట్రిక్ టెస్టులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వివరించారు. ఈ ప్రక్రియలో నిపుణుల సేవలు వాడుకోవడంతో పాటు ఉపాధ్యాయులకు తగిన శిక్షణ ఇవ్వాలని సీఎం తెలిపారు.

**ఉన్నతాధికారుల భాగస్వామ్యం**

ఈ సమీక్షా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రెండు వారాల్లోగా నివేదిక సమర్పించండి:

మొదటి పేజీ తరువాయి

దిల్లీ: అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ వ్యవహారానికి సంబంధించిన కేసు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ ఘటనపై రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని కేసును దర్యాప్తు చేస్తున్న 'సిట్' అధికారులను ఆదేశించింది. ఈ బృందంలో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను కూడా చేర్చాలని పేర్కొంది. విరాళాల నిధుల మళ్లింపు, రికార్డుల తనిఖీకి ఫోరెన్సిక్ నిపుణుడి అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఆలయ విరాళాల వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టాలన్న పిటిషనర్ విజ్ఞప్తిపై స్పందిస్తూ.. ప్రస్తుతం తమ దృష్టి అంతా దర్యాప్తుపైనే ఉందని వ్యాఖ్యానించింది. సిట్ నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసం ఈ కేసుపై సోమవారం విచారణ చేపట్టింది. యూపీ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. సిట్ అధికారులు, యూపీ పోలీసులు ఈ ఘటనపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నారని..దర్యాప్తులో తేలిన విషయాలను త్వరలో ధర్మాసనం దృష్టికి తీసుకువస్తామని కోర్టుకు వివరించారు. కాగా ఈ కేసును సీబీఐ, కాగ్‌తో విచారణ జరిపించాలని పలువురు సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.

## ఆ నియామకాలు చెల్లవ్..

మొదటి పేజీ తరువాయి

చెన్నై: విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కరూర్ తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఇచ్చిన ఉద్యోగాలు చెల్లవని ఉన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. రాజ్యాంగ పరిమితులకు లోబడి ప్రభుత్వం వ్యవహరించాలని సూచించింది. ప్రభుత్వ చర్యలపై నియంత్రణ లేకపోతే.. అరాచకం, అశాంతి రాజ్యమేలుతాయని పేర్కొంది. "ప్రభుత్వ ఉద్యోగం అనేది ఉచితంగా పంచిపెట్టేది కాదు. దాన్ని కష్టపడి సాధించాలి. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్నారు" అని వ్యాఖ్యానించింది.

గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన టీవీకే (ఎంఖ) ర్యాలీలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో 41 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని విజయ్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మరోసారి కరూర్ వెళ్లి అర్హతలున్న 32 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో తాత్కాలిక నియామక పత్రాలను అందజేశారు.

దీనిపై అన్నాడీఎంకే నేత ఆర్.బి. ఉదయ్‌కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్టపరమైన విధానాలను పక్కనపెట్టి తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగాలు ఇచ్చారంటూ హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతో మంది యువత తీవ్రంగా శ్రమిస్తున్నారని, ప్రభుత్వం ఏ ఉద్యోగ నియమాక ప్రక్రియ చేపట్టినా తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారానే చేపట్టాలని కోరారు. దీనిపై తాజాగా విచారణ చేపట్టిన న్యాయస్థానం సీఎం విజయ్ చేపట్టిన ఈ నియామకాలు చెల్లబోవని తీర్పునిచ్చింది.

## కుప్పం అభివృద్ధికి

### సీఎం చంద్రబాబు కృషి: నారా భువనేశ్వరి

మొదటి పేజీ తరువాయి

**కుప్పం, జూలై 27 :**

కుప్పం నియోజకవర్గాన్ని సీఎం చంద్రబాబు ఎంతో అభివృద్ధి చేశారని నారా భువనేశ్వరి తెలిపారు. రామకుప్పం మండలం పీఎంకే తాండా మహిళలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 2024 ఎన్నికల్లో తాండాల్లో తెలుగుదేశం జెండా ఎగిరిందని, చంద్రబాబు విజయం తర్వాత నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు లభించిందని అన్నారు. ఒకేసారి 30 పరిశ్రమలు తీసుకురావడం ద్వారా వేలమంది స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

**తాండా సమగ్ర అభివృద్ధి**

పీఎంకే తాండాలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. పంచాయతీ పరిధిలో రూ.75 లక్షలతో సీసీ రోడ్లు, రూ.30 లక్షలతో ఇతర రహదారుల నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు. తాండాలో కమ్యూనిటీ భవనం నిర్మించడంతో పాటు గోకులం షెడ్ల నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరయ్యాయని వివరించారు. రూ.25 లక్షలతో ఓం శక్తి దేవాలయాన్ని కూడా అభివృద్ధి చేసినట్లు చెప్పారు.

**తాగునీటి కల సాకారం**

గతంలో కుప్పం ప్రాంతంలో తీవ్ర నీటి ఎద్దడి ఉండేదని, చంద్రబాబు కృష్ణా జలాలు తీసుకువచ్చి ప్రజల దశాబ్దాల కలను నెరవేర్చారని చెప్పారు. నదుల అనుసంధానంతో సాగు, తాగునీరు సమృద్ధిగా అందుతోందన్నారు. ఎన్నికల హామీల మేరకు ఎన్టీఆర్ భరోసా, దీపం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, అన్నా క్యాంటీన్లు విజయవంతంగా అమలువుతున్నాయని పేర్కొన్నారు.

**మహిళా సాధికారత**

మహిళలు ఇంటికే పరిమితం కాకుండా నైపుణ్య శిక్షణ కేంద్రాల ద్వారా శిక్షణ పొంది సొంతంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ధైర్యంగా ముందడుగు వేస్తేనే ఏదైనా సాధించగలమని అన్నారు. సుపరిపాలన అందిస్తారనే నమ్మకంతో ప్రజలు కూటమికి విజయం అందించారని, ప్రజల నమ్మకాన్ని ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని తెలిపారు.

### మాజీ ఎమ్మెల్యే పెద్దికి

## కెసిఆర్ పరామర్శ

మొదటి పేజీ తరువాయి

పెద్ది కుటుంబసభ్యులకు కేసీఆర్ మనోధైర్యాన్ని అందించారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు. రెండు రోజుల క్రితమే యశోద హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న పెద్దికి



ఆదివారం హనుమకొండలోని ఇంట్లో ఉదయం 7 గంటలకు తీవ్రమైన గుండెపోటు రాగా.. ఆయన భార్య స్వప్న వెంటనే దగ్గరలోని రోహిణి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కార్డియాలజిస్ట్ మమతారెడ్డి నేతృత్వంలో వైద్యుల బృందం వేగంగా స్పందించి అత్యవసర వైద్యం అందించారు. అత్యవసర సీపీఆర్ అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్ది సుదర్శన్ రెడ్డిని గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారని తెలిసిందే.

# అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం

●కోహెడను వర్ధంతి వేడుకలు

**జన సముద్రం న్యూస్ కోహెడ జూలై 27:( కోహెడ ప్రసాదరావు)**

భారత రత్న,భారత దేశపు ప్రముఖ క్షిపణి శాస్త్రవేత్త, 11వ, భారత రాష్ట్రపతి డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలామ్ 12వ, వర్ధంతి వేడుకలు సోమవారం జరిగాయి.

సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో కలామ్ చిత్రపటానికి పూలమాల వేసిఘనంగానివాళు లర్పించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ, వారి అడుగుజాడల్లో నడవాలని పేర్కొన్నారు.

డాక్టర్ ఏ.పి.జే అబ్దుల్ కలామ్ అక్టోబర్ 15, 1931 జన్మించారని ,ఈయన మన భారతదేశపు ప్రముఖ క్షిపణి శాస్త్రవేత్త మరియు 11వ, మన భారత రాష్ట్రపతి. 1962లో ఆయన (మన భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ) ఇస్రోకు మారారని వివరించారు.అక్కడ ఆయన ఇతర శాస్త్రవేత్తలతో కలసి



అనేక కృత్రిమ ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించారని తెలిపారు.. అగ్ని క్షిపణి, పృధ్వి క్షిపణి మిస్సైళ్ళ అభివృద్ధి ప్రయోగాలకు ఆయనే సూత్రధారని కొని యడారు.దీంతో ఆయనకు భారతదేశపు "మిస్సైల్ మ్యాన్" అని పేరు వచ్చిందని తెలిపారు. జూలై 1992లో ఆయన భారతదేశపు రక్షణ మంత్రికి సాంకేతిక సలహాదారు అయ్యారని,భారత ప్రభుత్వానికి ప్రధాన సాంకేతిక సలహాదారుగా ఆయనకు క్యాబినెట్ మంత్రి హోదా వచ్చిందని వివరించారు. ఆయన కృషి ఫలితంగానే 1998లో పోఖ్రాన్-×× అణుపరీక్షలు విజయవంతంగా జరిగాయని కొనియాడారు.ఈ అణు పరీక్షలు భారతదేశాన్ని అణ్వస్త్ర రాజ్యాల సరసన ఘనత తనదేనని అన్నారు.భారతదేశపు మూడు అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ భూషణ్ (1981 లో); పద్మ విభూషణ్ (1990 లో) మరియు భారత రత్న (1997 లో) లతో పాటు నలభై విశ్వవిద్యాలయాలనుంచి గౌరవ డాక్టరేట్లు పొందిన వ్యక్తి డా.కలామ్ అని కొనియాడారు. ఆయన భారత దేశపు యువతను వెన్ను తట్టి ప్రోత్సహించే ఉద్దేశంతో తన ఆత్మకథ వింగ్స్ ఆఫ్ ఫైర్ లాంటి పుస్తకాలు అనేకం వ్రాశారని వివరించారు.

రాష్ట్రపతిగా కూడా సేవలందించిన మహనీయుడు ఏపిజే అబ్దుల్ కలాం జూలై 27, 2015 సోమవారం హఠాన్మరణానికి గురయ్యారని,ఇలాంటి మహనీయుల అడుగుజాడల్లో నడవాలని ,అలాగే పిల్లల్లో విద్యార్థి దశ నుండే తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యార్థులు లోని ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించి దేశానికి మంచి శాస్త్రవేత్తలుగా అందించి మన సమాజాన్ని అభివృద్ధి బాట లో నడిపించాలని సామాజిక కార్యకర్త రాజు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పందిల్ల ఎంపీపీ ఏస్ ప్రధానోపాధ్యాయులు నారాయణ రెడ్డి, కిరణ్ మయి విద్యార్థులు పి.సాయి అక్షర దేవి,అద్వైత, మాదవి, వనిత, ఆదిత్య , వర్షిత్ తేజ, స్వాతి, సోనియా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం టి యు ఎఫ్

●తెలంగాణ ఉద్యమకారుల కేక కమిటీ గారికి మా విజ్ఞప్తి

**జనసముద్రం రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జులై 27**



తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షులు : పొందుర్తి ఉమేశ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శ్రీ చీమ శ్రీనివాసరావు గారు మరియు కళా తపస్వి యెల్ల పోశెట్టి రాష్ట్ర కన్వీనర్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం గారి ఆదేశాల మేరకు కాలయాపన చేయకుండాతెలంగాణ ఉద్యమ కారుల గుర్తింపు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి లిఇచ్చిన హామీల అమలుప్రారంభించాలి.ప్రియతమా తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేస్తూ మా ప్రధాన డిమాండ్లుతెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి ఉద్యమకారుల సంక్షేమానికి ప్రత్యేకమైన బడ్జెట్ కేటాయించాలి సంక్షేమ పథకంలో 10% కోట కల్పించాలి ఉద్యమకారులకు ఇంటి స్థలాలు. పెన్షన్. ఉచిత బస్సు పాస్.హెల్త్ కార్డులు ఇవ్వాలి ఉద్యమకార్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. తెలంగాణ సాంస్కృతిక సారధిలో ఉద్యోగాలు కల్పించాలి ఉద్యమకారుల ఆత్మగౌరవం కోసం మా ఉద్యమం కొనసాగుతుంది.తెలంగాణ ఉద్యమకారుల ఫోరం టి యు ఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కమిటీఅధ్యక్షులు : పొందుర్తి ఉమేశ్ప్రధాన కార్యదర్శి :రామిండ్ల దేవదానం.ఉపాధ్యక్షులు : మాట్లా అశోక్ కార్యవర్గ సభ్యులు తాటిపెల్లి నరసయ్య మహేష్ స్వామి శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు

# కల్వకుర్తి నియోజకవర్గంలో శ్రీ గోలి శ్రీనివాస్ రెడ్డి గారి ఆధ్వర్యంలో పలువురు యువకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు భారీ సంఖ్యలో బీఆర్ఎస్వీలో చేరారు.

**కల్వకుర్తి జనసముద్రం న్యూస్ జూలై 27**

ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలు, తెలంగాణ అభివృద్ధి కోసం పార్టీ చేసిన కృషిని చూసి యువత స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని అన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు, బాధ్యతలు కల్పిస్తూ కలిసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామని తెలిపారు.

అదేవిధంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పై అయినా స్పందించారు..

ఇది విద్యార్థుల విజయమే -- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా స్వాగతించదగిన పరిణామం"బి

తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల పోరాటానికి లభించిన విజయమని అన్నారు.

దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువజన సంఘాలు, తల్లిదండ్రులు విద్యా వ్యవస్థలో చోటుచేసుకున్న





అవకతవకలు, పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాలపై నిరంతరం పోరాడిన ఫలితంగానే ఈ పరిణామం చోటుచేసుకుందని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడకుండా, విద్యా వ్యవస్థపై ప్రజల్లో కోల్పోయిన విశ్వాసాన్ని పునరుద్ధరించేలా సమగ్ర సంస్కరణలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేసిన కేంద్ర ప్రభుత్వ వైఖరి కారణంగానే దేశవ్యాప్తంగా ఆందోళనలు చెలరేగాయని విమర్శించారు.

ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పారదర్శకమైన పరీక్షల నిర్వహణ, బాధ్యులపై కఠిన చర్యలు, విద్యార్థుల హక్కుల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని గోలి శ్రీనివాస్ రెడ్డి కోరారు.

చివరిగా,విద్యార్థుల ఐక్యత, ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటమే ఈ విజయానికి కారణమని, విద్యార్థుల హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.

కార్యక్రమంలో కల్వకుర్తి మండలం దీ=వా పార్టీ అధ్యక్షులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సింగం విజయ్ గౌడ్, నల్లచెరువు మాజీ సర్పంచ్ కృష్ణ రెడ్డి,జేపల్లి వార్డు సభ్యులు గోపాల్ నాయక్,దీ=వా తరుణ్ నాయక్,రాజు, ప్రకాస్, శ్రీరామ్,శివరాం, రాహుల్, వసంత్,అలాజి, వీర,రాంతేజ, మహేష్, రామాంజి,సశాంక్, శివ,మహేష్, మహేష్, ప్రవీణ్,సాయి,చందు, ఆనంద్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు కురవాలని రుద్రేశ్వర స్వామికి అఘోర పాశుపత రుద్రాభిషేకం

●రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక పూజలు

●500 మందికి అన్నప్రసాద వితరణ

**హనుమకొండ, జూలై 27(జనసముద్రం)**



శివప్రీతికరమైన సోమవారం, త్రయోదశి సందర్భంగా హనుమకొండలోని చారిత్రక రుద్రేశ్వర స్వామి వేయి స్తంభాల దేవాలయంలో రుద్రేశ్వర స్వామికి అఘోర పాశు పత రుద్రాభిషేకం, సామూహిక రుద్రాభిషేకాలను వైభవంగా నిర్వహించారు.రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.హైదరాబాద్‌కు చెందిన కమ్మ సేవా సంఘం మహిళలు పూర్ణిమ, దీప్తి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలోని సహజ వృక్షాల వద్ద రైతుల కష్టాలను పరమేశ్వరుడు ఆలకించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని ప్రత్యేకంగా ప్రార్థించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గాలి, మేఘాలు అనుకూలించి రైతులు నాగలి దున్ని పంటల సాగు ప్రారంభించే పరిస్థితులు ఏర్పడాలని వేడుకున్నారు.తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 12 ప్రధాన దేవాలయాల్లో మూడు రోజులుగా వరుణ పారాయణాలు, ఋష్యశృంగ పారాయణాలు, వరుణ హోమాలు, యాగాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ పూజల ఫలితంగా రాష్ట్రంలో త్వరలోనే మంచి వర్షాలు కురుస్తాయని భక్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులతో పాటు సుమారు 500 మందికి అన్నదానం, అన్నప్రసాద వితరణ నిర్వహించారు.అన్నదాతలైన రైతులు చల్లగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని భక్తులు ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్ శర్మ, ఆలయ కార్యనిర్వహణ అధికారి డి. అనిల్ కుమార్, రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు జ్యోతి, మాధవి, పల్లవి, బైరీ రజిత, ఆలయ సిబ్బంది మధుకర్, రామకృష్ణ, సుధాకర్ పాల్గొని భక్తులకు సేవలు అందించారు.

# హుస్నాబాద్ లో అలరించిన గాన మాధురి

●శ్రీ గజానన మ్యూజికల్ ఆధ్వర్యంలో పాటల పోటీలు

**జనసముద్రం న్యూస్ కోహెడ జూలై 28: (కోహెడ ప్రసాదరావు)**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలోని బి. ఎల్. ఆర్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం జరిగిన గాన మాధురి కార్యక్రమం శ్రోతలను అలరించినది.శ్రీ గజాననమ్యూజికల్ ఈవెంట్స్ బ్యానర్ లో

ఆర్గనైజర్ సుధాకర్ శర్మ- అరుణ ఆధ్వర్యంలో గాన మాధురి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాటల ప్రోగ్రాం లో మొదటగా దీప ప్రజ్వలన తో ప్రారంభం చేసారు. అరుణ- సుధాకర్ శర్మ వారి గానామృతంతో పాటల ప్రోగ్రామును ప్రారంభించారు.తమ గానా మాధుర్యముతో ఉర్రూతలూగించారు. పాటలు పాడడానికి కరీంనగర్, వరంగల్, సిద్దిపేట, హైదరాబాద్ వంటి సుదూర





ప్రాంతంలో నుండి గాయని గాయకులు చాలామంది హాజరయ్యారు. గాయని గాయకులు ఆలపించిన పాటలు శ్రోతలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో

డాక్టర్ మోహన్ శర్మ, శ్రీమతి జోత్స్న ఆలపించిన పాటలు అభినందనలు అందుకున్నాయి. అలాగే ప్రవీణ్ బుడంపాటి శ్రీనివాస్ కిషోర్ కొత్తపెల్లి అశోక్ సువర్ణ శిరీష శ్రీదేవి భూజాత కమల ధార పావని మొదలగు గాయకులు పాల్గొన్నారు. అంతకుముందు గాన కోకిల జానకమ్మ ఇటీవల మృతి చెందడం పట్ల ఆమెను స్మృతిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. దశాబ్దాల పాటు గాన మాధుర్యంతో ప్రజల హృదయాలను ఆకట్టుకున్న జానకి కి ఘనంగా నివాళు లర్పించారు. జానకమ్మ ఆలపించిన పాటలతో హాజరైన గాయనీ గాయకులు ఆలపించడంతో జానకమ్మ గానస్మృతులను నెమరు వేసుకున్నట్లు అయినది. ఇంకా ఈ కార్యక్రమంలో గాయనీ గాయకులతో పాటు పట్టదానికి చెందిన పలువురు ప్రముఖులు, కళాకారులు, ఔత్సాహిక శ్రోతలు హాజరయ్యారు.

# వర్షాలు సమృద్ధిగా కురవాలని ఉమ్మడగ్రామంలో ప్రత్యేక శివార్చనలు

**జనసముద్రం ప్రతినిధి జడల గంగాధర్27**

నిజాంబాద్ జిల్లా నందిపేట్ మండలం ఉమ్మడ గ్రామంలో వర్షాలు సమృద్ధి గా కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాశిస్తూ గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా భక్తులు గోదావరి జలలు తీసుకొచ్చి ఉమామహేశ్వర స్వామికి పవిత్ర అభిషేకం నిర్వహించారు అనంతరం ప్రత్యేక అర్చనలు ఆహారతులు సమర్పించి రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురవాలని చెరువులు కుంటలు నిండాలని పాడి పంటలు సమృద్ధిగా పండాలని భగవంతుని ప్రార్థించారు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో గ్రామంలో ప్రతి ఏడాది నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుంది గ్రామ పెద్దలు తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప సర్పంచ్ గ్రామ పెద్దలు గ్రామస్తులు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు



# వల్లభాపూర్‌లో ఎస్ఆర్ఆర్ ఫార్మసీ కళాశాల ఉచిత వైద్య శిబిరం

●ఎన్ఎస్ఎస్ యూనిట్ -- అజారా హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామస్థులకు వైద్య సేవలు

●విద్యార్థులు సేవాభావంతో రావాలి: ప్రొఫెసర్ ఈ. నారాయణ

**ఎల్కతుర్తి, జూలై 27(జనసముద్రం)**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్లభాపూర్ గ్రామంలోని ఎస్ఆర్ఆర్ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో, అజారా ఆసుపత్రి సహకారంతో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈ.నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ, విద్యార్థులు ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, ఎన్ఎస్ఎస్ ద్వారా లభించే ఉన్నత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అలాగే వల్లభాపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కళాశాల ముందుండి కృషి చేయాలని ఆకాంక్షించారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. బైరి ఆగయ్య గౌడ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతంలో కళాశాలను స్థాపించి విద్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం తమ లక్ష్యమని తెలిపారు. గ్రామ అభివృద్ధికి కళాశాల తరపున ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం



గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ముఖ్య అతిథి ప్రొఫెసర్ ఈ. నారాయణతో పాటు అజారా ఆసుపత్రి వైద్యులు డా. హెచ్. భారత్‌ను శాలువాలతో సన్మానించారు.ఈ వైద్య శిబిరంలో గ్రామస్థులకు ఉచిత రక్తపరీక్షలు, రక్తపోటు పరీక్షలు, రక్తంలో చక్కెర పరీక్షలు, ఈసీజీ పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. వై. కరుణాకర్ రెడ్డి, డా. పరమేశ్వర్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మృతిని కుటుంబానికి ఆర్థిక సహాయం

**జన సముద్రం ప్రతినిది పి శ్రీనివిస్.**

తలకొండపల్లి మండలం ఎడెల్లి గ్రామం వాస్తవ్యులైన గుద్దేటి లక్ష్మమ్మ పరామాపదించారు. ఈ విషయాన్ని. మెకానిక్ పర్వతాలు

.ద్వారా.తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రామ్. ఎడెల్లి గ్రామంలోని వారి నివాసానికి చేరుకొని.. లక్ష్మమ్మ.పార్థిహ దేహం పై పూలమాలవేసి తన పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని. కోరుకుంటూ ఘన నివాళులు అర్పించారు.. అనంతరం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్య పడొద్దు నేనున్నానంటూ భరోసాను కల్పిస్తూ.. తన వంతు ఆర్థిక సహాయం మృతురాలి కుమారుడు వెంకటయ్యకు. అందజేసి తన యొక్క సేవా గుణాన్ని. చాటు కోవడం జరిగింది. ఈ



కార్యక్రమంలో రామ్ మిత్ర మండలి సభ్యులు భాస్కర్. పర్వతాలు. జంగయ్య. రాములు.కనకయ్య. యాదయ్య. తదితరులు పాల్గోన్నారు.

# మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజుకు జన్మదిన శుభాకాంక్షలు

●దివ్యాంగుల సంఘ అధ్యక్షుడు చిక్కాల వాసు

**మొగల్తూరు, జూలై 27 జనసముద్రం**

మొగల్తూరు మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు జన్మదిన సందర్భంగా నర్సాపురం మదర్ థెరీసా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు చిక్కాల వాసు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఉపాధ్యక్షులు కడలి ఏసు హాజరయ్యి




సంఘం తరపున శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిక్కాల వాసు మాట్లాడుతూ గుబ్బల నాగరాజు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న నాయకుడని కొనియాడారు. ప్రజా సేవలో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గుబ్బల నాగరాజుకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సంగం తరపున తెచ్చిన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం పంపిణీ చేశారు.

# బోధనా పద్ధతులను తరగతి గదిలో అమలు చేయాలి: ఎంఈఓ కొమరం నాగయ్య.

**జన సముద్రం న్యూస్, పినపాక నియోజకవర్గం ప్రతినిధి, జులై 27.**




ఉపాధ్యాయ శిక్షణలో నేర్చుకున్న బోధనా పద్ధతులను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా కృషి చేయాలని మండల విద్యాధికారి కొమరం నాగయ్య సూచించారు. పినపాక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 21 నుంచి రెండు విడతలుగా ఆరు రోజుల పాటు నిర్వహించిన ఇన్‌సర్వీస్ ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు, ఇంగ్లీషు, గణితం సులభ బోధన పద్ధతులు, రెమిడియేషన్ తరగతుల నిర్వహణ, విద్యార్థుల అభ్యసన లోపాల గుర్తింపు వంటి అంశాలపై శిక్షణలో నేర్చుకున్న విషయాలను పాఠశాలల్లో సమర్థంగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామిరెడ్డి, రిసోర్స్ పర్సన్లు రాజేశ్వరరావు, కృష్ణయ్య, బాబురావు, షాలిని, సీఆర్పీలు పాల్గొన్నారు.

# శ్రీ భద్రకాళీ ఆలయంలో శాకంభరీ విశ్వరూప దర్శనానికి సర్వం సిద్ధం

**●జూలై 29 బుధవారం శాకంభరీ విశ్వరూప దర్శనం**

**హనుమకొండ, జూలై 27(జనసముద్రం)**

కాకతీయుల రాజధాని ఏకశిలానగరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో నిర్వహిస్తున్న శాకంభరీ నవరాత్రి మహోత్సవాలు సోమవారం 13వ రోజుకు చేరుకున్నాయి. ఉదయం నిత్యాహ్నిక కార్యక్రమాల అనంతరం తిథిమండల దేవతా యజ్ఞంలో భాగంగా కాళీ క్రమానుసారం అమ్మవారి ఉత్సవమూర్తులను మాత్రా, షోడశీ క్రమానుసారం సర్వమంగళ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ భద్రకాళి శేషు మాట్లాడుతూ, దశమహావిద్యలలో ఆద్యవిద్య అయిన కాళీ సపర్యలో త్రయోదశి తిథికి అధిదేవత మన్మథుడని, పంచతన్మాత్రలు, పంచభూతాలు, వాటి సూక్ష్మగుణాల రూపంలో అమ్మవారు సమస్త జీవరాశుల్లో వ్యాపించి ఉన్నారని తెలిపారు. సర్వమంగళా నిత్యా రూపంలో అమ్మవారి అనుగ్రహంతో భక్తులకు శుభమంగళాలు కలుగుతాయని పేర్కొన్నారు. జూలై 29, బుధవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి అమ్మవారికి వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలతో శాకంభరీ అలంకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ అలంకరణ ఉదయం 9 గంటల వరకు కొనసాగుతుందని, ఆ సమయంలో భక్తులకు దర్శనం



ఉండదని స్పష్టం చేశారు. అలంకరణ అనంతరం పూజలు పూర్తి చేసి ఉదయం 9 గంటల నుంచి సర్వదర్శనం, విశిష్ట దర్శనం, అతిశీఘ్ర దర్శనం, ధర్మ దర్శనాల ద్వారా భక్తులను అనుమతిస్తామని వెల్లడించారు. అదే రోజు ఉదయం 11 గంటలకు వ్యాసపూజ, మహాపూర్ణాహుతి, బలిప్రదానం, అవబృథంతో శాకంభరీ నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ముగియనున్నాయి. శాకంభరీ విశ్వరూప దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, క్యూలైన్ల ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీమతి రామల సునీత, ప్రధాన అర్చకులు శ్రీ భద్రకాళి శేషు, హరనాథ్‌లు మట్వాడ



సీఐ కరుణాకర్, ఎస్ఐలు, పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు.

ఈ రోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్యాడర్ సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీమతి సునీత దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈఓ రామల సునీత, ప్రధాన అర్చకులు శ్రీ భద్రకాళి శేషు ఘన స్వాగతం పలికి, మహదాశీర్వచనం అందించి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీఓ వెంకన్న, టూరిజం అధికారి శివాజీ, తహసీల్దార్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం “శ్రీనివాస మంగాపురం” చిత్ర హీరో గట్టమనేని జైకృష్ణ, దర్శకుడు అజయ్ భూపతి, చిత్ర యూనిట్ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అర్చకులు మహదాశీర్వచనం చేసి అమ్మవారి శేషవస్త్రాలను వారికి అందజేశారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి,

**●మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 27, 2026:**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. తాండూరు మండలం అచలాపూర్ గ్రామానికి చెందిన ఆముర్ల కృష్ణ తనకు ఆర్థిక స్తోమత లేదని, తన పిల్లలకు జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కన్నెపల్లి మండల కేంద్రానికి చెందిన గాండ్ల మల్లేష్, గాండ్ల తిరుపతి తమ తాతల నుండి వస్తున్న భూమిని కొందరు అక్రమంగా పట్టా చేయించుకున్నారని, ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి దొంగ పట్టాను రద్దుచేసి తమ పేరిట పట్టా చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన సురిమిల్ల పెద్దయ్య తన పేరిట గ్రామ శివారులో ఉన్న భూమి విస్తీర్ణం ఆన్ లైన్ లో తక్కువగా నమోదు అయిందని, వివరాలను పరిశీలించి సవరించాలని





కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండల కేంద్రానికి చెందిన కె.కృష్ణవేణి తాను గురుకుల పాఠశాలలలో హెల్త్ సూపర్వైజర్ గా పనిచేస్తున్నానని, ఈ సంవత్సరం ఆటో రెన్యువల్ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. భీమిని మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ముత్తినేని రాజేశం ప్రమాదంలో గాయపడి వెన్నుపూస దెబ్బతిందని, తనకు బండి ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం పులిమడుగు గ్రామానికి చెందిన బానోత్ రాజు తాను దివ్యాంగుడిని అని, తనకు తెలియకుండా తన భూమిని నకిలీ పత్రాల ఆధారంగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారని, ఈ విషయమై విచారించి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండలం రామకృష్ణాపూర్ ప్రాంతానికి చెందిన రవికుమార్ తాను, తన భార్య దివ్యాంగులమని, నిరుపేద అయిన తమకు రెండు పడక గదుల ఇల్లు ఇప్పించి అంత్యోదయ కార్డు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం పొనకల్ గ్రామానికి చెందిన దుమల్ల అరుణ్ కుమార్ తన తండ్రి గ్రామ రెవెన్యూ సహాయకుడిగా విధులు నిర్వహిస్తూ మరణించారని, కారుణ్య నియామకం క్రింద తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో ఎన్నో ఏళ్లుగా ఉన్న శ్రీ రామ టాకీస్ రైతు బజార్ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించిన టౌన్ సీఐ కరుణాకర్ , ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్,మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్

**జన సముద్రం న్యూస్ జగిత్యాల జిల్లా జులై 26**

ట్రాఫిక్ అంతరాయం ఏర్పడేలా రోడ్డుపై వ్యాపారం చేస్తున్న కూరగాయల వ్యాపారులను రైతు బజార్‌లోకి తరలింపు

కృతజ్ఞతలు తెలిపిన జగిత్యాల ప్రజలు

జగిత్యాల పట్టణంలోని శ్రీ రామ టాకీస్ వద్ద గల రైతు బజార్ పరిసర ప్రాంతంలో కూరగాయల వ్యాపారులు రహదారులపై వ్యాపారం నిర్వహించడం వల్ల గత కొంతకాలంగా తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడి, వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై ప్రజల నుంచి పలుమార్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో శాశ్వత పరిష్కారం దిశగా నేడు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

టౌన్ సీఐ శ్రీ పి. కరుణాకర్ గారి ఆధ్వర్యంలో , ట్రాఫిక్ ఎస్ఐ శ్రీ బి. మల్లేష్ గారు, మున్సిపల్ కమిషనర్ శ్రీ సత్య ప్రణవ్ గారు, వార్డు కౌన్సిలర్ శ్రీమతి అరవ లక్ష్మి గారు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది మరియు మున్సిపల్ సిబ్బంది సంయుక్తంగా రైతు బజార్ ప్రాంతంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

డ్రైవ్ సందర్భంగా రహదారులపై వ్యాపారం నిర్వహిస్తున్న





హోల్‌సేల్ మరియు రిటైల్ కూరగాయల వ్యాపారులతో సమావేశమై, రోడ్డుపై వ్యాపారం వల్ల ప్రజలకు, ట్రాఫిక్‌కు కలుగుతున్న ఇబ్బందులను వివరించి, రైతు బజార్ ప్రాంగణంలోనే వ్యాపారం నిర్వహించాలని అవగాహన కల్పించారు. అధికారుల విజ్ఞప్తికి వ్యాపారులు సానుకూలంగా స్పందించి, స్వచ్ఛందంగా రైతు బజార్‌లోకి వెళ్లి తమ వ్యాపారాలను ప్రారంభించారు.

అదేవిధంగా రైతు బజార్ ప్రాంగణంలోకి ద్విచక్ర వాహనాలు, ఆటోరిక్షాలు ప్రవేశించకుండా మార్కెట్ ప్రవేశ ద్వారాల వద్ద రెండు నిషేధ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో మార్కెట్‌లో పాదచారుల రాకపోకలు మరింత సురక్షితంగా మారడంతో పాటు ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గింది.

ఇకపై రైతు బజార్ వెలుపల రహదారులపై కూరగాయల వ్యాపారం నిర్వహించకుండా అందరూ సహకరించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

జగిత్యాల పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు, ప్రజలకు సౌకర్యవంతమైన మరియు సురక్షితమైన రాకపోకలు కల్పించేందుకు ఇలాంటి ప్రత్యేక చర్యలు నిరంతరం కొనసాగుతాయని టౌన్ సీఐ శ్రీ పి. కరుణాకర్ గారు మరియు ట్రాఫిక్ ఎస్ఐ శ్రీ బి. మల్లేష్ గారు తెలిపారు.

జగిత్యాల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఉద్యమ కారుల హామీలు వెంటనే అమలు చేయాలి






**●కాలయాపన చేస్తే ఉద్యమం ఉధృతం**

**●తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకుల హెచ్చరిక**

**జన సముద్రం న్యూస్ జగిత్యాల జిల్లా: జూలై 27,**

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్, చీమ శ్రీనివాస్ పిలుపు మేరకు, జగిత్యాల జిల్లా ఉద్యమ కారుల ఫోరం జిల్లా ఛైర్మన్ జవ్వాజి శంకర్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం కీలక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా చైర్మెన్ శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కేకే కమిటీ ద్వారా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను రెండు నెలల లోపు కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కాలయాపన చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. కేకే కమిటీ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి నివేదికను సమర్పించాలని కేకే కమిటీకి సూచించడం జరిగింది. స్వరాష్ట్రం కోసం వంటావార్పు, రాస్తారోకో, రైలరోకో, సాగరహారం మిలియన్ మార్చ్ లాంటి ఉద్యమాలతో పోరాడాం. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే అదే స్థాయిలో మళ్లీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం” అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కళాకారుల విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల సతీష్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ పిలుపుమేరకు, కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి ఆదేశాల మేరకు ఈరోజు సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, ఉద్యమకారులకు మరియు ఉద్యమ కళాకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని, అర్హులైన నిరుపేద కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలని లేని పక్షంలో ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కళాకారులతో మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

ఈ సమావేశంలో

ఉద్యమ నాయకులు ప్రధాన కార్యదర్శి భారతపు లింగారెడ్డి , తొలి మలిదశ ఉద్యమ నాయకులు దేవరాశెట్టి జనార్దన్ , నచుపల్లి రెడ్డి, నియోజకవర్గం కన్వీనర్ కొండ్రా ప్రేమ్ కుమార్ , అరుముల్ల ఉమేందర్, మరాఠి గంగారెడ్డి, పరకాల వేణుగోపాల్, జుట్టు శంకర్ వేముల రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## గుడులు, మసీదుల్లో నీటి సంరక్షణకు కొత్త ప్రతిపాదన..

**ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలకు ఊతం ఇవ్వాలని వినతి**

**మల్కాజిగిరి 27 జులై (జనసముద్రం న్యూస్):**



మల్కాజిగిరిలో రోజురోజుకూ భూగర్భ జలాల మట్టం తగ్గిపోతుండటంతో నీటి సమస్య తీవ్రంగా మారుతోంది. ఈ నేపథ్యంలో దేవాలయాలు, మసీదుల వద్ద భక్తులు కాళ్లు కడుక్కునే నీటిని వృథా కాకుండా ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని “మానవసేవే మాధవసేవ” సంస్థ అధ్యక్షుడు కుమ్మరి రాజు జోనల్ కమిషనర్‌ను కోరారు .ప్రతిరోజూ వేలాది మంది భక్తులు ఆలయాలు, మసీదులకు రావడంతో వేల లీటర్ల నీరు మురుగు కాలువల్లో కలిసిపోతోందని సంస్థ పేర్కొంది. ప్రతి ప్రార్థనా స్థలం వద్ద ప్రత్యేక ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తే ఆ నీరు తిరిగి భూగర్భ జలాల్లోకి చేరి నీటి నిల్వలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు .ఇలాంటి చర్యలు నీటి సంరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు ఉపయోగపడతాయని, మల్కాజిగిరిలో నీటి ఎద్దడిని తగ్గించడంలో కీలకంగా నిలుస్తాయని,ప్రతి గుడి మసీదు వద్ద ఇంకొంతలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ను కోరడం జరిగింది.

## ఎస్ఐఆర్ ప్రవాస్ అభియాన్‌లో భాగంగా బీజేపీ మండల పదాధికారుల సమావేశం

**సమావేశానికి అధ్యక్షత వహించిన మంతుర్తి శ్రీకాంత్ యాదవ్**

**ఎల్కతుర్తి, జూలై 27(జనసముద్రం)**



హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఎల్కతుర్తి మండలంలో ఎస్ఐఆర్ (ఎస్ ఐ ఆర్) ప్రవాస్ అభియాన్ (పర్యటన) కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ మండల పదాధికారుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మండల సంయోజక్‌గా హాజరై పార్టీ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రతి కార్యకర్త చురుగ్గా పాల్గొనాలని, పార్టీ సంస్థాగత బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా సమగ్ర కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల బూత్ కమిటీల పనితీరును సమీక్షించి, బాధ్యతలను ఖరారు చేశారు. అలాగే ఇటీవల నూతనంగా ఎన్నికైన మండల పదాధికారులను ఘనంగా సన్మానించి, పార్టీ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ అధ్యక్షత వహించగా, మండల పదాధికారులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, శక్తికేంద్ర ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాయిరెడ్డిగూడ గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం -- 800 ఓట్లు ఆన్‌లైన్ నమోదు





**కందుకూరు న్యూస్ (జూలై 27)జనసముద్రం**

కందుకూరు మండలం లోని సాయిరెడ్డిగూడ గ్రామ పంచాయతీ లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్ ) ప్రక్రియలో భాగంగా సుమారు 800 ఓట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. అలాగే బిఎల్ఓ బాలమణి ఆధ్వర్యంలో 98 ఓట్లు మరణం లేదా ఇతర ప్రాంతాలకు బదిలీ కారణంగా తొలగింపు కోసం గుర్తించినట్లు సమాచారం వెల్లడించారు.

గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు సర్పంచ్ కొంగళ్ల అనిత నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సహకారం అందించారు.

ఈ కార్యక్రమంలో టీచర్ భాగ్యలక్ష్మి, ఉపసర్పంచ్ సకీలాల శ్రీను, పంచాయతీ కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొని ఓటర్లకు అవసరమైన సూచనలు, సహాయం అందించారు. గ్రామ ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి మంచి స్పందన తెలుపుతూ తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకున్నారు.

## జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా ఆషాఢ మాస గోరింటాకు కార్యక్రమం





**జన సముద్రం న్యూస్ జగిత్యాల జిల్లా జూలై 26**

జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా గోరింటాకు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

సకల శుభాలకు, సౌభాగ్యానికి ప్రతీకగా భావించే ఆషాఢ మాసం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిల్ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు దంపతులుగా పాల్గొని వేడుకకు ప్రత్యేక శోభ తీసుకువచ్చారు.

మహిళలు ఉత్సాహంగా గోరింటాకు పెట్టుకొని ఆనందోత్సాహాల మధ్య వేడుకను జరుపుకున్నారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ మాట్లాడుతూ, మన సంస్కృతి, సంప్రదాయాల్లో ఆషాఢ మాసానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని అన్నారు. గోరింటాకు శుభానికి, సౌభాగ్యానికి ప్రతీకగా మన సంప్రదాయంలో ప్రత్యేక స్థానం కలిగి ఉందన్నారు. మన పండుగలు, ఆచార సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటడంతో పాటు అందరి మధ్య ఆత్మీయత, ఐక్యతను మరింత పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, మహిళా సంఘాల రిసోర్స్ పర్సన్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై ఉన్న గుంత పూడ్చిన యువకులు,

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై27:**





భీమారం మండల కేంద్రం నుండి ఆరేపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడడంతో, ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్నందున, మానవతా దృక్పథంతో యువకులు శ్రీరాముల మల్లేష్, నక్క వేణు, సుందిళ్ల వెంకటేష్, నక్క సంపత్, వారి మిత్రులు, రోడ్డు ప్రక్కన ఉన్న మట్టిని రవి గుంతను పూడ్చివేశారు, ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడిన యువకులను పలువురు అభినందించారు

# రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుతో లబ్ధి పొందాలి,

**• మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 27, 2026:**

ప్రస్తుతం నెలకొన్న ఎల్ నినో ప్రభావాన్ని అధిగమించేందుకు రైతులు వరి సాగు మినహా ప్రత్యామ్నాయ పంటల సాగు చేసి లబ్ధి పొందాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల రైతు వేదికను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో ఇప్పటివరకు తక్కువ వర్షపాతం నమోదు అయిందని, రాబోవు 3 నెలలలో కూడా ఈ పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. నీటి లభ్యతలో లోటు ఉండడంతో వరి సాగులో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. నీటి ఇబ్బంది కారణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి లబ్ధి పొందాలని తెలిపారు. భూగర్భ జలం తక్కువగా ఉందని, రైతులు ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని, పప్పుధాన్యాలు, పత్తి, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి నీరు తక్కువ అవసరం ఉన్న పంటలు సాగు చేయాలని, అవసరమైన రాయితీ విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తక్కువ సమయంలో పంట చేతికి వచ్చే తక్కువ నీటి అవసరం ఉన్న పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని, వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని గ్రామాలలో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు వివరించాలని తెలిపారు. మండలాలు, గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి ఆదాయం వచ్చే పంటలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం





జరుగుతుందని, భూసార పరీక్షలు నిర్వహించి కార్డులు అందించడం జరుగుతుందని, పంట సాగుకు అనుగుణంగా యూరియా అందించడం జరుగుతుందని తెలిపారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, ల్యాబ్, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు.

బెల్లంపల్లి మండలం గురజాల గ్రామంలో గల రైతు వేదికలో ఏర్పాటు చేసిన రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి సురేఖతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ రైతులు ప్రస్తుత ఎల్ నినో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంట రకాన్ని ఎంచుకోవాలని, తక్కువ నీటి అవసరం గల పంటలను సాగు చేసి లబ్ధి పొందాలని తెలిపారు. ఈ క్రమంలో రైతులకు రాయితీ విత్తనాలు, ఎరువులు అందించడం జరుగుతుందని, రైతులు తమ సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ఎరువులు, విత్తనాలు పొందాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని మండల తహసిల్దార్ కృష్ణతో కలిసి సందర్శించి ప్రత్యేక సమగ్ర సవరణ, సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రజల నుంచి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. రాజకీయ పార్టీల తరపున నియమించబడిన బూత్ స్థాయి ఏజెంట్లు ఇంకా ఎన్యుమరేషన్ ఫారాలు అందించని వారి నుండి సేకరించి బూత్ స్థాయి అధికారులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులతో సరి చూసి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి,

**•మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 27, 2026:**

వర్షాకాలం దృష్ట్యా మున్సిపల్ పరిధిలోని డివిజన్లు/వార్డులలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్యతో కలిసి మున్సిపల్ కమిషనర్లతో అభివృద్ధి పనుల వేగవంతం, పారిశుధ్య పనుల నిర్వహణ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పారిశుద్ధ నిర్వహణలో ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా చేపట్టాలని, ప్రతిరోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను సేకరించాలని తెలిపారు. మున్సిపల్ అభివృద్ధిలో





భాగంగా చేపట్టిన అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. వార్డులలో వీధి దీపాలు లేని ప్రాంతాలను గుర్తించి వెంటనే ఏర్పాటు చేయాలని, దోమల వృద్ధిని నివారించే విధంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారుల సమన్వయంతో మున్సిపల్ పరిధిలోని ఆసుపత్రులలో అవసరమైన వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉండేలా పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజలకు శుద్ధమైన త్రాగునీటిని సరఫరా చేసే విధంగా కార్యాచరణ అమలు చేయాలని, అమృత్ 2.0 పథకం క్రింద చేపట్టిన నీటి ట్యాంకులు, పైప్ లైన్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. నగర అభివృద్ధి నిధులతో కేటాయించిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలోని పన్ను బకాయిలను 100 శాతం వసూలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐటీడీఏ ఏపీఓకు వినతిపత్రం అందజేసిన గ్రామీణ పేదల సంఘ నాయకులు

**జనసముద్రం న్యూస్ ఖానాపూర్ నియోజకవర్గం ఇంచార్జ్ కండ్లే శ్రావణ్ కుమార్**

జులై 27 ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్ ఐటీడీఏ ఏపీవోకు గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు గ్రామీణ పేదల సంఘం తెలంగాణ రాష్ట్ర ఓ పి డి ఆర్ డి విజయేంద్రావు గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వెంకటాద్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎలక్షన్లో సమయంలో అన్ని పార్టీల నాయకులు జెండాలు పట్టుకొని మారుమూల గ్రామాలైన ఆదివాసుల కుటుంబాలకు వెళ్లి వారికి వచ్చిన రీతిలో విచ్చలవిడిగా హామీలు కురిపించి ఆదివాసుల ఓట్లు వేయించుకొని ఈరోజు గద్దెనెక్కిన రాష్ట్ర ప్రభుత్వం అటు కేంద్ర ప్రభుత్వాలు గత 40 సంవత్సరాలుగా ఆదివాసుల పోడు భూములకు హక్కు పత్రాలు ఉన్నప్పటికీ అటవీశాఖ అధికారులు ఈ మధ్యకాలంలో గిరిజన భూములను ఆక్రమంగా కందకాలు కొట్టుతూ వారికి ఉపాధిగా ఉన్న భూములలో మొక్కలు నాటుతూ గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారు ఇది ప్రభుత్వాలకు సరైన పద్ధతి కాదని ఇలాంటి సమస్యను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి





తీసుకెళ్లి గిరిజన భూమిని కాపాడే బాధ్యత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన గిరిజనుల భూమిని అటవీశాఖ అధికారులు గుంజుకోవడం సరైనది కాదని తక్షణమే ఆదివాసుల భూమికి అటవీ శాఖ అధికారులను అడ్డగించకుండా రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఇదిలా ఉంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లకు కూడా అటవీ శాఖ అధికారులు ఇసుక తేవడంలో నానారకాలుగా ఇబ్బందులు పెడుతున్నారని కొని ఆదివాసుల గ్రామాలలో సరైన రోడ్లు కూడా లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయని ఆ యొక్క గ్రామాలకు రోడ్లు మంజూరైన వేయకుండా అటవీశాఖ అధికారులు అడ్డుపడుతున్నారని అది కూడా వెంటనే మానుకొని యధావిధిగా మంజూరైన రోడ్లను కూడా వేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఐటిడిఏ ఉట్నూర్ ఏపీఓ జాదవ్ వసంతరావుకు వినతిపత్రం అందజేశారు ఐటిడిఏ ఏపీవో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల విషయంలో జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు పంపమని అలాగే ఇసుకకు అడ్డంకులు ఇక నుండి జరగవని వారు హామీ ఇచ్చారు అదేవిధంగా పోడు భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతామని వారు హామీ ఇచ్చారు ఈ యొక్క కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం కటికల శంకర్ ఆసిఫా బాద్ జిల్లా అధ్యక్షులు ఓపిడిఆర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అంబాల మహేందర్ జిల్లా అధ్యక్షులు సాంబాజి వాగ్మేరే నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం మున్నయ్య దస్తురాబాద్ మండల కార్యదర్శి బాలసాని మల్లేష్ గౌడ్ ఖానాపూర్ కార్యదర్శి దర్శనాల మల్లేష్ మంచిర్యాల అధ్యక్షులు ధారంగుల ఎల్లయ్య మంచిర్యాల కార్యదర్శి వేముల నరసయ్య జిల్లా కమిటీ సభ్యులు చందం రాజమౌళి మండల కార్యదర్శి బోడ కిషన్ పట్టణ కార్యదర్శి మామిడిపల్లి నాగరాజు మరియు తదితరులు

# నూతన ఎంపీఓ వెంకటేశ్వరరావు కు ఘన సన్మానం



**పినపాక నియోజకవర్గం ప్రతినిధి, జన సముద్రం న్యూస్, జూలై 27.**

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీఓ వెంకటేశ్వరరావుతో పాటు పినపాక మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) సంకీర్తను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వారికి శాలువాలు కప్పి, శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గ, మండల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో, మండల సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో ఉంటూ, మండలాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని, తమపై నమ్మకంతో సహకరిస్తున్న కాంగ్రెస్ నాయకులకు, శ్రేణులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, లక్ష్మారెడ్డి జిల్లా సెక్రటరీ బోడ రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు చిట్టిమల్ల ప్రసాద్, సర్పంచులు, ఉప సర్పంచ్లు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు నైపుణ్యాభివృద్ధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి,

**•మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య,**

**జనసముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 27, 2026:**

ఉపాధ్యాయులకు అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్లలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమంలో భాగంగా ఫౌండేషన్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన 3 రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమానికి మండల విద్యాధికారి తిరుపతి రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాస స్థాయిని మెరుగుపరచడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం, కార్యాచరణ ఆధారిత బోధన, వినూత్న బోధనా పద్ధతుల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి విద్యార్థిలో నేర్చుకునే సామర్థ్యాన్ని పెంపొందించేలా కృషి చేయాలని తెలిపారు.



2026--27 విద్యా సంవత్సరంలో జిల్లాలో ఎంపికైన ఫౌండేషన్ పాఠశాలల్లో ఎఫ్.ఎల్.ఎం. కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. పి.జి.ఐ. సూచికలలో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా పని చేయాలని తెలిపారు. 3 రోజులపాటు నిర్వహించే ఈ శిక్షణలో బోధన--అభ్యాస ప్రక్రియను మరింత ప్రభావవంతంగా రూపొందించడం, విద్యార్థులలో ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించడం, తరగతి గది నిర్వహణలో ఆధునిక విధానాలను అమలు చేయడం వంటి అంశాలపై మాస్టర్ ట్రైనర్లు, నిపుణులు సమగ్ర అవగాహన కల్పిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎ.ఎం.ఓ. జంబోజు సత్తయ్య, హాజీపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, ఎంఐఎస్ సిబ్బంది, మాస్టర్ ట్రైనర్లు, ఫౌండేషన్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడి పుష్కరకాలం దాటింది.

**•భద్రాచలం రామాలయంలో అత్యధిక శాతం సిబ్బంది ఏపీకి చెందిన వారే ఇప్పటికీ భద్రాద్రి రామాలయంలోనే ఉద్యోగాల్లోఉన్నారు**

**•ఈ కారణంగా తెలంగాణ నిరుద్యోగులు నష్టపోతున్నారు.**

**జన సముద్రం న్యూస్ జూలై 27 బ్యూరో చీఫ్ టెంపుల్ టౌన్ భద్రాచలం.**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాలుగా ఏర్పాటై (12 ఏళ్ళు) పుష్కరకాలం దాటుతోంది. రెండు రాష్ట్రాలుగా ఏర్పడ్డ తరువాత ప్రభుత్వ శాఖలలోని సిబ్బంది నింపాదిగా ఎవరి రాష్ట్రాలకు వాళ్లు చేరుకోవడం జరిగింది.

ఇంకా అక్కడక్కడ కొన్ని శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులు వారి రాష్ట్రాలకు వెళ్లవలసి ఉన్నది. ఇది ఇలా ఉండగా రెండు రాష్ట్రాలలో దేవాదాయ శాఖలో కూడా స్వరాష్ట్రాలకు వెళ్ళవలసిన ప్రభుత్వ సిబ్బంది అధికంగానే ఉన్నట్లు తెలియ వస్తోంది. ఈ మధ్యనే ఆంధ్రప్రదేశ్లో పెద్ద దేవాలయమైన శ్రీశైలం దేవస్థానంలో10 మంది తెలంగాణకు చెందిన



ఉద్యోగులు ఉన్నట్లు వారిని తెలంగాణకు పంపించినట్లయితే ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని శ్రీశైలం దేవస్థానం చైర్మన్ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కి లేఖ రాయడం కూడా జరిగింది.

ఈవిధంగానే భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో అధిక శాతం సిబ్బంది ఏపీకి చెందిన వారే ఉన్నారని, వారిని ఇక్కడ నుండి ఏపీలోని దేవాలయాలకు పంపించినట్లయితే తెలంగాణలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని,

ఈవిషయంలో తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించిభద్రాచలం మొదలగు ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఉద్యోగాలు చేస్తున్న ఏపీ వారిని ఆ రాష్ట్రాలకు పంపి తెలంగాణ నిరుద్యోగులకు న్యాయం చేయవలసిందిగా నిరుద్యోగులు కోరుతున్నారు.

# రోడ్డు లేక గర్భిణీకి మార్గమధ్యలో ప్రసవం తల్లి, బిడ్డ క్షేమం.

**జన సముద్రం న్యూస్, పినపాక నియోజకవర్గం ప్రతినిధి, జులై 27.**

రహదారి సౌకర్యం లేకపోవడంతో ఓ గర్భిణీకి అంబులెన్స్‌లోనే ప్రసవం జరిగిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,బూర్గంపాడు మండలం, చింతకుంట గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సోడి మార్త (30)కు పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గుంతలమయంగా మారిన రోడ్డుపై అంబులెన్స్ గ్రామానికి చేరుకుని ఆమెను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా నొప్పులు తీవ్రం కావడంతో మార్గమధ్యలోనే వాహనాన్ని నిలిపివేయాల్సి వచ్చింది. అత్యవసర వైద్య సిబ్బంది (ఈఎంటీ) రాధ అంబులెన్స్‌లోనే ప్రసవం నిర్వహించగా మార్త పండంటి



మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లి, శిశువును భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. గ్రామానికి సరైన రహదారి లేక గర్భిణీలు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే చింతకుంట గ్రామానికి శాశ్వత రహదారి నిర్మించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# చక్రధర్ డిగ్రీ కళాశాల లో జరిగిన అబ్దుల్ కలాం వర్ధంతి

**జనసముద్రంన్యూస్, మాచర్ల, జూలై 27;**

పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలోని చక్రధర్ డిగ్రీ కళాశాలలో ఏపీజే అబ్దుల్ కలాం 11వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించటం జరిగింది. ఆయన ప్రపంచంలో లోనే అద్భుత వ్యక్తి అని దేశానికి మార్గదర్శకం చేసిన వ్యక్తి అని అత్యుత్తమ భారత రాష్ట్రపతి అని, భారతరత్న, పద్మభూషణ్, పద్మ విభూషణ్ అవార్డు గ్రహించిన గొప్ప వ్యక్తి అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్



ఆఫ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షులు డాక్టర్ గుర్రం రాజశేఖర్ రెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు పటాన్ నాగూర్ వలి, లైన్స్ క్లబ్ సెక్రటరీ ఎం.వి. పుల్లారావు, ప్రిన్సిపాల్ కె.సాయిమార్కొండా రెడ్డి, అధ్యాపకులు ఎన్ ఎఫ్ ఎస్ రాణి ప్రసన్న. కుర్రి పవనేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. డిబేట్లో ప్రథమ స్థానం పొందిన టి.తేజ. బి.అనంతలక్ష్మి. యు.జ్యోతి లకు బహుమతులను అధ్యక్షులు అందజేశారు.

# 95వ బూత్ లో జరిగిన "ఇంటింటికీ ప్రచార కార్యక్రమం"

**జనసముద్రంన్యూస్, మాచర్ల, జూలై 27;**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంటింటికి ప్రచార కార్యక్రమం లో భాగంగా 95వ బూత్ లో బూత్ ఇంచార్జ్ ఉప్పుతోళ్ల చెన్నకేశవులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటికీ తిరిగి రెండేళ్ల లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం గురించి బూత్ లోని ప్రజలకు వివరించారు.



# జిల్లాలో విజయవంతంగా 'ఎస్ఐఆర్' ప్రక్రియ పూర్తి

- 85.28 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేశాం:
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శు
- 'సర్' ప్రక్రియ పూర్తి కావడానికి అహర్నిశలు శ్రమించిన జిల్లా అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపిన కలెక్టర్

**నెల్లూరు, జులై 27, జన సముద్రం జిల్లా ప్రతినిధి.**

నెల్లూరు జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు.

సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, గణాంకాలు, తదుపరి చర్యలపై కలెక్టర్ వివరాలు వెల్లడించారు. జూన్ 15 నుంచి జూలై 24 వరకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. జిల్లాలోని మొత్తం 19,74,240 మంది ఓటర్లలో 16,83,557 మంది నుంచి ఎన్యూమరేషన్



ఫారాలు సేకరించి 85.28 శాతం మ్యాపింగ్ పూర్తి చేసినట్లు చెప్పారు.

మ్యాపింగ్ పూర్తైన వారిలో 83.5 శాతం మందిని 2002 ఓటర్ల జాబితాతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల వివరాల ఆధారంగా అనుసంధానం చేయడం జరిగిందని, ఇది రాష్ట్రంలోనే ఒక విశేషమైన పురోగతిగా పేర్కొన్నారు.

మ్యాపింగ్ కాని 1.8 శాతం మంది ఓటర్లకు భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన 12 రకాల అధికారిక గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి సంబంధిత ఈఆర్ఓకు సమర్పిస్తే వారి ఓటు హక్కు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో 38,645 డూప్లికేట్ ఓట్లు (1.96 శాతం) గుర్తించామని, సంబంధిత ఓటర్ల అంగీకారంతో వాటిని తొలగిస్తామని తెలిపారు. అలాగే 1,13,421 మంది (5.75 శాతం) శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిగా, 80,699 మంది (4.09 శాతం) మరణించిన వారిగా, 57,077 మంది (2.89 శాతం) అందుబాటులో లేని వారిగా గుర్తించినట్లు వివరించారు. ఉపాధి నిమిత్తం తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి వచ్చి అవసరమైన ఆధారాలు సమర్పిస్తే వారి ఓటు హక్కును పునరుద్ధరిస్తామని తెలిపారు.

ఈ నెల 31వ తేదీన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని, అనంతరం దానిని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడంతో పాటు గుర్తింపు పొందిన ఎనిమిది రాజకీయ పార్టీలకు ప్రింట్, పెన్‌డ్రైవ్ రూపంలో అందజేస్తామని చెప్పారు. డ్రాఫ్ట్ ప్రచురణ అనంతరం 30 రోజుల పాటు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని, అర్హులైన ఓటర్లు తమ పేర్లు లేకపోయినా లేదా వివరాల్లో లోపాలు ఉన్నా సంబంధిత ఈఆర్ఓ, ఏఈఆర్ఓలను సంప్రదించి సవరించుకోవచ్చన్నారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ఒకరికి ఒకే ఓటు ఉండేలా చూడటమే భారత ఎన్నికల సంఘం లక్ష్యం. సీఈఓ వివేక్ యాదవ్ సూచనలు సలహాల మేరకు జిల్లాలో సర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేయగలిగాం. అలాగే గత 45 రోజులుగా సెలవులు కూడా తీసుకోకుండా రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసిన సచివాలయ సిబ్బంది, బీఎల్‌వోలు, తాసిల్దార్లు, ఆర్‌డీవోలు, ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న అన్ని శాఖల అధికారులకు నా ప్రత్యేక అభినందనలు," అని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పేర్కొన్నారు. సర్ ప్రక్రియలో కీలకంగా పనిచేసి విజయవంతం చేసిన జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్ఓ విజయ్ కుమార్ ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

# కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమఫలాలను ప్రతి ఇంటికీ చేరవేయాలి: డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి

**రాయచోటి జనసముద్రం న్యూస్ జులై 27**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయాలని, తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేసే బాధ్యత ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్తపై ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, రాయచోటి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి అన్నారు.

సోమవారం ఉదయం రాయచోటి--మదనపల్లె రోడ్డులోని అజయ్ రెసిడెన్సీలోలి నిర్వహించిన తెలుగుదేశం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాయచోటి నియోజకవర్గ అబ్జర్వర్ అన్నా అనిత యాదవ్ లిపార్టీనాయకులు లిమౌర్యా రెడ్డి లి తో కలిసి పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ప్రతి పథకం, ప్రతి అభివృద్ధి కార్యక్రమం గురించి ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు నిజమైన లబ్ధిదారులకు చేరుతున్నాయని ప్రజలకు వివరించడంతో పాటు, ప్రతి ఇంటిని ప్రత్యక్షంగా కలిసే డోర్-





టు-డోర్ కార్యక్రమాన్నిలి సమర్థవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి బూత్‌లో పార్టీని మరింత బలోపేతం చేయాలని, బూత్ కమిటీలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, గ్రామ అధ్యక్షులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ వారి సమస్యలను తెలుసుకొని, పార్టీ పట్ల విశ్వాసాన్ని మరింత పెంపొందించే విధంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని అన్నారు.

పార్టీ కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి అసలైన బలం అని, వారి కృషి, అంకితభావం, సమిష్టి కృషితోనే స్థానిక సంస్థల ఎన్నికల్లోలి ఘన విజయం సాధించగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేయడం, ఎన్నికల వ్యూహాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా విజయాన్ని అందుకోవచ్చని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణ, డోర్-టు-డోర్ ప్రచారం, బూత్ స్థాయి బలోపేతం, గ్రామాల వారీగా బాధ్యతల కేటాయింపు, పార్టీ విస్తరణ,లి ప్రజలతో అనుసంధానం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.

ఈ కార్యక్రమంలో ఆరు మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, బూత్ మరియు క్లస్టర్ ఇన్‌చార్జిలు, గ్రామ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# సిపిఐ కార్యాలయంలో గిరిజన సమాఖ్య నూతన కమిటీ ఎన్నిక

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, నర్సరావుపేట, జూలై 27;**

నర్సరావుపేట పట్టణంలోని సీపిఐ పార్టీ ఆధ్వర్యంలో గిరిజన సమాఖ్య నూతన కమిటీ ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షులు ముఖ్య సూర్య నాయక్,ఉపాధ్యక్షులు పాలపర్తి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి, కోయ శ్రీను, సహాయ కార్యదర్శి పాలపర్తి వెంకటలక్ష్మి, కోశాధికారి మొగిలి సుబ్రమణ్యం, కమిటీ సభ్యులుగా మేడ శ్రీను, చలంచర్ల కృష్ణ, కుంభ నారాయణ, చేవూరి కుమార్, మొగిలి కోటేశ్వరరావు, దశావతు బాలు నాయక్ లను నూతన కమిటీ సభ్యులుగా నియమించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి శ్రీను నాయక్ మాట్లాడుతూ గిరిజన సమాఖ్యను బలోపేతం దిశగా కృషి





చేయాలన్నారు. ప్రభుత్వం గిరిజనులకు ఇస్తామన్నటువంటి హామీలను అమలు చేయడంలో విఫలం అవుతుందన్నారు. పోరాట దిశగా కూడా ముందుకు వెళ్లవలసిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా కార్పొరేషన్ ద్వారా గిరిజనులకు ఆర్థికంగా బలోపేతం చేయడం లేదన్నారు. సామాజికంగా, ఆర్థికంగా గిరిజనులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం మొండి చేయి చూపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సిపిఎస్ సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య తో పాటు పలువురు పాల్గొన్నారు.

# మూలపేట శివాలయంలో మంత్రి నారాయణ కుటుంబం ప్రత్యేక పూజలు

- మంత్రి నారాయణ, కుమార్తె షరిణికి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం
- సోమవారం 7,000 మందికి సైకిళ్ల పంపిణీ. సక్సెస్ అవ్వాలని శివాలయంలో వేడుకున్న షరిణి
- సైకిళ్ల పంపిణీకి శ్రీకారం. అబ్దుల్ కలాం స్కూల్ పనుల పరిశీలన

**నెల్లూరు, జులై 27, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**

నెల్లూరులో విద్యార్థుల భవిష్యత్తు కోసం రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ చేపట్టిన బృహత్తర కార్యక్రమం విజయవంతం కావాలని కోరుకుంటూ మంత్రి నారాయణ ,కుమార్తె షరిణి, మనవాడుతో కలిసి మూలపేట శ్రీ శివాలయాన్ని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు,





వేదపండితులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో వారికి ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు..భక్తిశ్రద్ధలతో పల్లకి సేవలో పాల్గొన్నారు. అనంతరం షరిణి మీడియాతో మాట్లాడరు.. నగర పరిధిలోని 23 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 7,000 మంది విద్యార్థులకు ఫేజ్-1 కింద ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేసే మహత్కార్యం సోమవారం సాయంత్రం 4:00 గంటలకు వి.ఆర్. హైస్కూల్‌లో జరగనుందని, ఈ సైకిళ్ల ద్వారా విద్యార్థులకు ప్రయాణ సౌకర్యం పెరిగి కాన్సంట్రేషన్, ఫోకస్ తో బాగా చదువుకుంటారని వెల్లడిస్తూ, ఈ పంపిణీ కార్యక్రమం పూర్తిగా సక్సెస్ అవ్వాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు.

పూజల అనంతరం వారు పరమేశ్వరి నగర్‌లోని అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన మనందరి బాధ్యత అని పేర్కొంటూ పనులను అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో 39వ డివిజన్ క్లస్టర్ ఇంచార్జ్ అన్నంగి ప్రసాద్, మాజీ కార్పొరేటర్ ?నాగరాజ నాయకులు ?దీనదయాల్ ,?కొత్తూరు మురళీ మోహన్,జనార్ధన్ రెడ్డి,?మహేష్ కుమార్, స్థానిక టిడిపి నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బడుగుల ఆత్మగౌరవానికే ప్రాధాన్యత..!

**-ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి**

**జనసముద్రంన్యూస్, కారంపూడి, జూలై 27;**

బడుగు బలహీన, అణగారిని వర్గాల ఆత్మగౌరవానికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. మండల పరిధిలోని ఒప్పిచర్ల గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల వారు అనాదిగా స్మశాన వాటిక లేక అనేక ఇబ్బందులు పడుతూ.., వివక్షను ఎదుర్కొంటున్నారు. వారు అనాదిగా పడుతున్న సమస్యలు ఎమ్మెల్యే జూలకంటి దృష్టికి తీసుకురాగా ఆయన తక్షణమే స్పందించి, స్థానిక తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ ను భూమి





కేటాయించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో వారందరికీ కులాలవారీగా దాదాపు 52 సెంట్ల ప్రభుత్వ భూమిని మంజూరు చేస్తూ హక్కు ధృవీకరణ పత్రాలను స్థానిక ఆర్ అండ్ బి బంగ్లా సోమవారం ఎమ్మెల్యే అందజేశారు.ఎమ్మెల్యే జూలకంటి చేతుల మీదగా పట్టాలు అందుకున్న వారిలో చెంచులు- 10 సెంట్లు,ఎరుకల -10 సెంట్లు,బుడగ జంగాలు- 8 సెంట్లు, మాల -8 సెంట్లు, రజకులు 5 సెంట్లు, నాయి బ్రాహ్మణలు - 2, విశ్వబ్రాహ్మణలు -2, గంగిరెద్దుల-2 ఉన్నారు. స్మశానానికి స్థల కేటాయించిన కూటమి ప్రభుత్వానికి, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు పంగులూరి పుల్లయ్యకు ఈ సందర్భంగా వారందరూ కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఈ-సిటీ మహేశ్వరం పారిశ్రామిక పార్కులలో పలు పరిశ్రమలను సందర్శించిన సి.ఎస్ సంజయ జాజు



ఈ-సిటీ (వజఓఎ)లోని ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (జుశ్రీవషితీశీఅఱఛ మీఖఅబటుఖీబతీఅస్త్ర జశ్రీబర్వతీ - జువీజ) ను, ప్రీమియర్ ఎనర్జీస్ ఫోటోవోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ, అవాంటెల్ లిమిటెడ్ పరిశ్రమ, మంఖాల్ పారిశ్రామిక పార్క్ ను సందర్శించి, ఎం/ఎస్. చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నేడు ఉదయం సందర్శించారు. సి.ఎస్ తో పాటు టి.జి.ఐ.ఐ.సి. (౧+××జ) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శశాంకతో పాటు సీనియర్ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ముందుగా, మెసర్స్ ప్రీమియర్ ఎనర్జీస్ ఫోటోవోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. ఈ-సిటీలో 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన ఈ సంస్థ సోలార్ పీవీ (౹౦) మాడ్యూల్స్ తయారీచేస్తోంది. రూ.1,240 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమలో ప్రస్తుతం 1,200 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

అనంతరం ఎం/ఎస్. అవాంటెల్ లిమిటెడ్ పరిశ్రమను సీ.ఎస్ సందర్శించారు. ఈ సంస్థ 4 ఎకరాల విస్తీర్ణంలో ఈ-సిటీలో ఉన్న ఈ పరిశ్రమ హైటెక్ రక్షణ ఎలక్ట్రానిక్స్, శాటిలైట్ పేలోడ్ వ్యవస్థలు, గ్రౌండ్ స్టేషన్ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రధానంగా చేపడుతోంది. రూ.59.22 కోట్ల పెట్టుబడితో ఉన్న ఈ సంస్థలో 400 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

ఈ సందర్భంగా, మంఖాల్ పారిశ్రామిక పార్క్ ను సందర్శించి, మెసర్స్ చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ పరిశ్రమను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందర్శించారు. . ఈ సంస్థకు ప్రారంభంలో 1,20,881 చదరపు మీటర్లు (29.87 ఎకరాలు) విస్తీర్ణం గల భూమి బీఓపీపీ (దీఖ్రా)/బీఓపీఈటీ (దీఖ్రాజు) ఫిల్మ్ తయారీ యూనిట్ స్థాపన కోసం కేటాయించారు. . ఇందులో కోటింగ్, మెటలైజింగ్, స్లిట్టింగ్ రీసైక్లింగ్ ఉత్పత్తులు జరుగుతాయి. కాగా, తమకు . కేటాయించిన స్థలంలో ఈ చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ సంస్థ తన తయారీ యూనిట్‌ను విజయవంతంగా నెలకొల్పి, ప్రాజెక్టుతో పాటు విస్తరణ ప్రాజెక్టును కూడా పూర్తి చేసింది. ప్రస్తుతం ఈ యూనిట్ వాణిజ్య ఉత్పత్తి నిర్వహిస్తూ రూ.284.02 కోట్ల పెట్టుబడితో 500 మందికి ఉపాధి కల్పిస్తోంది.

అనంతరం, మహేశ్వరం జనరల్ పార్క్ లోని మెసర్స్ విప్రో ఎంటర్‌ప్రైజెస్ (ప్రైవేట్) లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. ఈ సంస్థకు 1,21,410 చదరపు మీటర్లు (30 ఎకరాలు) విస్తీర్ణంలో భూమి కేటాయించారు. ప్రస్తుతం ఈ యూనిట్ రూ.17,434 లక్షల పెట్టుబడితో వాణిజ్య ఉత్పత్తి నిర్వహిస్తూ 331 మందికి ఉపాధి కల్పిస్తోంది. చివరిగా ఎం/ఎస్. మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ మ్యాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ను సంజయ్ జాజు సందర్శించారు. ఈ సంస్థకు మహేశ్వరం జనరల్ పార్క్‌లోని మొత్తం 14,973 చదరపు మీటర్లు (3.7 ఎకరాలు) విస్తీర్ణంలో భూమి అత్యాధునిక రత్నాలు, ఆభరణాల తయారీ యూనిట్ స్థాపన కోసం కేటాయించారు. ఈ సంస్థకు కేటాయించిన స్థలంలో తయారీ యూనిట్‌ను విజయవంతంగా ఏర్పాటు చేసి విస్తరణ ప్రాజెక్టులను పూర్తి చేసింది. ప్రస్తుతం ఈ యూనిట్ రూ.37,405 లక్షల పెట్టుబడితో వాణిజ్య ఉత్పత్తి నిర్వహిస్తూ 2,782 మందికి ఉపాధి కల్పిస్తోంది.

ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కల్పనలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అభినందిస్తూ, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి మరింత వేగం తీసుకురావాలనిసీ.ఎస్ సంజయ్ జాజు అధికారులను కోరారు.

# కలిసికట్టుగా ా×= పై దృష్టి సారించాలి..

**గడప గడపకు వెళ్ళి ఓటరును ఓటరు జాబితాలో చేర్చాలి..**
**పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరించాలి..**
**ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు..**



పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య గారి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు . చింతకుంట విజయరమణ రావు అనంతరం కౌన్సిలర్లు, వార్డ్ ఆఫీసర్లు బూత్ లెవెల్ ఆఫీసర్లు, మెప్మా ఆర్పీలతో ా×= పై ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు సమీక్ష సమావేశం నిర్వహించారు.

సర్వసభ్య సమావేశం అనంతరం జెండా చౌరస్తా నుండి మసీదు చౌరస్తా వరకు గల రోడ్డు వెడల్పు జరగనున్న రోడ్డును వ్యాపారస్తులను కలుస్తూ పరిశీలించిన ప్రభుత్వ విప్ విజయరమణ రావు

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ...

పెద్దపల్లి పట్టణంలో కలిసికట్టుగా ా×= పై దృష్టి సారించాలని 36 వార్డులో ా×= కార్యక్రమంపై ప్రతి ఒక్క కౌన్సిలర్, వార్డ్ ఆఫీసర్లు మరియు బూత్ లెవెల్ ఆఫీసర్లు ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అవసరమైతే వార్డులో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయించాలని మున్సిపల్ కమిషనర్ గారికి సూచనలు చేయడం జరిగిందని తెలిపారు. పెద్దపల్లి పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు పార్టీలకు అతీతంగా సహకరించాలని కోరారు. పట్టణంలోని ప్రధాన రోడ్డు అయిన జెండా చౌరస్తా నుండి మసీదు చౌరస్తా వరకు గల 300 మీటర్ల రోడ్డును వ్యాపారస్తుల కోరిక మేరకు 55 ఫీట్ల వెడల్పు చేయడం జరుగుతుందని దీనికి అందరూ సహకరించాలని కోరారు. రోడ్డు వెడల్పు చేసిన తరువాత అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ అన్ని హంగులతో పాత రోడ్డు సుందరంగా తీర్చిదిద్దుతామని వ్యాపారస్తుల వ్యాపారం మరింత మెరుగు పరిచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని ఓటర్లను ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలని రేపటి నుండి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గడువు తేదీ వరకు పూర్తి స్థాయిలో ా×= కార్యక్రమాన్ని శ్రద్ధతో పూర్తి చేయాలని సూచనలు చేశారు. తానే స్వయంగా మున్సిపల్ పరిధిలో ా×= కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ , వైస్ చైర్ పర్సన్ ముస్కాన్ నాజ్ నయ్యర్ అలీ పట్టణ కౌన్సిలర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డ్ ఆఫీసర్లు, మెప్మా ఆర్పీలు, బూత్ లెవెల్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు రేపుతేదీల్లో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ జిల్లా పర్యటన:జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెల్లూరు, జూలై 26 : జన సముద్రం జిల్లా ప్రతినిధి**


ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ వెటుకూరి ఏ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు, సభ్యురాలు కే.జి. వెంకట పద్మలత ఈ నెల 28, 29 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలిపారు.

జూలై 28వ తేదీ (మంగళవారం) ఉదయం 10.00 గంటలకు మంగళగిరి నుండి రోడ్డు మార్గంలో బయలుదేరి మధ్యాహ్నం 1.00 గంటలకు నెల్లూరుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జిల్లాలోని పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, స్కాన్ సెంటర్లు, బాలల గృహాలు, పరిశ్రమలు, చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్ తదితర సంస్థలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తారు. జూలై 29వ తేదీ (బుధవారం) ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, ఐసీడీఎస్, మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య, బాలల గృహాలు, వన్ స్టాప్ సెంటర్, శక్తి నివాస్, డీసీపీయూ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, పోలీసు శాఖ, రవాణా శాఖ తదితర శాఖల ద్వారా బాలల సంక్షేమం, రక్షణ, బాల్య వివాహాల నివారణ, పోక్సో చట్టం అమలు, బాల కార్మిక నిర్మూలన, పాఠశాల మౌలిక సదుపాయాలు, విద్యార్థుల భద్రత, శిశు ఆరోగ్యం, పోషకాహారం, ఆధార్ సేవలు, బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహిస్తారు.

అనంతరం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలతో సమావేశమై వినతులు స్వీకరించి, పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమవుతారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# మూలపేట శివాలయంలో మంత్రి నారాయణ కుటుంబం ప్రత్యేక పూజలు





- **మంత్రి నారాయణ, కుమార్తె షరిణికి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం**
- **సోమవారం 7,000 మందికి సైకిళ్ల పంపిణీ. సక్సెస్ అవ్వాలని శివాలయంలో వేడుకున్న షరిణి**
- **సైకిళ్ల పంపిణీకి శ్రీకారం. అబ్దుల్ కలాం స్కూల్ పనుల పరిశీలన**

**నెల్లూరు, జులై 27, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**

నెల్లూరులో విద్యార్థుల భవిష్యత్తు కోసం రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ చేపట్టిన బృహత్తర కార్యక్రమం విజయవంతం కావాలని కోరుకుంటూ మంత్రి నారాయణ ,కుమార్తె షరిణి, మనవాడుతో కలిసి మూలపేట శ్రీ శివాలయాన్ని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు, వేదపండితులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో వారికి ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు..భక్తిశ్రద్ధలతో పల్లకి సేవలో పాల్గొన్నారు. అనంతరం షరిణి మీడియాతో మాట్లాడరు.. నగర పరిధిలోని 23 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 7,000 మంది విద్యార్థులకు ఫేజ్-1 కింద ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేసే మహత్కార్యం సోమవారం సాయంత్రం 4:00 గంటలకు వి.ఆర్. హైస్కూల్‌లో జరగనుందని, ఈ సైకిళ్ల ద్వారా విద్యార్థులకు ప్రయాణ సౌకర్యం పెరిగి కాన్సంట్రేషన్, ఫోకస్ తో బాగా చదువుకుంటారని వెల్లడిస్తూ, ఈ పంపిణీ కార్యక్రమం పూర్తిగా సక్సెస్ అవ్వాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. పూజల అనంతరం వారు పరమేశ్వరి నగర్‌లోని అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన మనందరి బాధ్యత అని పేర్కొంటూ పనులను అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో 39వ డివిజన్ క్లస్టర్ ఇంచార్జ్ అన్నంగి ప్రసాద్,

మాజీ కార్పొరేటర్ నాగరాజ నాయకులు దీనదయాల్ ,కొత్తూరు మురళీ మోహన్,జనార్ధన్ రెడ్డి,మహేష్ కుమార్, స్థానిక టిడిపి నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ కూటమి ప్రభుత్వం విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి డోర్ టు డోర్ ప్రచారానికి పిలుపు

**ముఖ్య అతిథులుగా పాల్గొన్నా ఏపీ ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి**






**జనసముద్రం న్యూస్, కొయ్యలగూడెం మండల రిపోర్టర్ ఈ.మనోహర్, జూలై 27,**

ఏలూరు జిల్లా, పోలవరం నియోజకవర్గం, పోలవరం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఏపీ ట్రైకార్ చైర్మన్, పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బోరగం శ్రీనివాస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు, ఈ సందర్భంగా పోలవరం బస్టాండ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సూపర్-6 హామీల అమలు తీరును ప్రజలకు వివరించారు, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, గత ప్రభుత్వ పాలనతో పోల్చితే స్పష్టమైన మార్పు కనిపిస్తోందని అభిప్రాయపడినట్లు బోరగం శ్రీనివాస్ తెలిపారు, ప్రతి కార్యకర్త ఈ ప్రచారాన్ని విజయవంతం చేసి ప్రభుత్వ విజయాలను ప్రతి ఇంటికీ చేర్చాలని ఆయన పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మంగిన వెంకటరమణ, ఆకుల రాజా, కుంచే దొరబాబు, పాదం ప్రసాద్, నల్ల రాంబాబు, పోతుల శ్రీనివాసరావు, జల్లేపల్లి సుబ్బారావు, యడ్ల వినోద్, మడకం లక్ష్మి, భాషా, చిన్నారి, సోమరౌతు మూర్తి, పూడి వెంకట్రావు, రొంగల అప్పారావు, దవళ వీరన్న, ఉలవల శ్రీనివాస్, ఉలవల సత్యనారాయణ, గుబ్బా రాంబాబు, ఇళ్ళా సత్యనారాయణ, చిక్కాల వెంకటేష్, నునకాని రాంబాబు, తెలంగంశెట్టి నాగేశ్వరరావు, షేక్ జిలాని, తెల్లం సూర్యచంద్రం, జల్లేపల్లి పెద్ద అబ్బులు, పత్తివాడ శ్రీనివాస్, కోడి శ్రీనివాస్, జల్లేపల్లి శేష వెంకట జితేంద్రతో పాటు పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ పేరుతో 4 లక్షల మంది నిరుద్యోగులతో ప్రభుత్వం ఆటలు.

- **సి బి ఐ తో సమగ్ర విచారణ జరిపించాలి.**
- **నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలి.**
- **ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్.**




**నెల్లూరు, జులై 27, జన సముద్రం జిల్లా ప్రతినిధి.**

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ-2025 నియామక ప్రక్రియలో భారీ స్థాయిలో అవినీతి, అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని, దానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణం రాజీనామా చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశ్నాపత్రాల తయారీ నుంచి ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశలోనూ ఉద్దేశపూర్వకంగానే నిబంధనలు ఉల్లంఘన జరిగిందని, గతంలో ఎన్నడూ చూడని విధంగా విద్యాశాఖలో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. మొత్తం డీఎస్సీ నియామక ప్రక్రియపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవ్వడంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నిన్న రాజీనామా చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, రాష్ట్రంలో అంతకంటే దారుణమైన అక్రమాలు జరిగినా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని ఎద్దేవ చేశారు. తప్పు చేయనప్పుడు సీబీఐ విచారణకు ఆదేశించడానికి ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని ఆయన ఘాటుగా ప్రశ్నించారు.

ఢిల్లీలో నీట్. ప్రశ్నపత్రం లీకేజీ అంశంపై నిరసనలు వ్యక్తమవ్వడంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నిన్న స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. మరి ఆంధ్రప్రదేశ్‌లో 4 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ, డీఎస్సీలో ఇన్ని అక్రమాలు జరిగినా నారా లోకేష్ ఎందుకు రాజీనామా చేయడం లేదు? డీఎస్సీ అక్రమాలపై వైఎస్సార్‌సీపీ మొదటి నుంచీ పారదర్శకమైన సీబీఐ విచారణ కోరుతోంది. తప్పు చేయనప్పుడు ప్రభుత్వం సీబీఐ ఎంక్వైరీకి ఎందుకు ముందుకు రావడం ఆయన ప్రశ్నించారు. అక్రమాలను ప్రశ్నిస్తున్న అభ్యర్థులు, ప్రతిపక్షాలపై కేసులు పెడుతూ, సామాజిక మాధ్యమాల్లో ఉపాధ్యాయులతో ట్రోల్ చేయిస్తూ ప్రభుత్వం దిగజారుడు రాజకీయం చేస్తుందని అసహనం వ్యక్తం చేశారు.డీఎస్సీ ప్రశ్నపత్రాలను తయారు చేసిన ఎస్సీఈఆర్టీ సంస్థలో నవీన్ అనే వ్యక్తి అవుట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సుమారు 30 వేల ప్రశ్నలను టైప్ చేసే విభాగంలో పనిచేసిన ఈ నవీన్ అనే ఉద్యోగికి డీఎస్సీ సోషల్ స్టడీస్‌లో రాష్ట్ర స్థాయిలో 1వ ర్యాంక్, టీజీటీ లో 6వ ర్యాంక్ వచ్చాయి. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, డీఎస్సీ కన్వీనర్ ఒకరే (కృష్ణా రెడ్డి) కావడం, టైపింగ్ సెక్షన్‌లో ఉన్న నవీన్ ద్వారా క్వశ్చన్ పేపర్లు బయటకు లీక్ అయ్యాయనడానికి ఇది స్పష్టమైన ఆధారం కాదా అని అన్నారు

తప్పుడు ప్రశ్నలు, నార్మలైజేషన్ దోపిడీ

పరీక్షలలో ఏకంగా 17 తప్పుడు ప్రశ్నలు ఇచ్చారు. ఒకే ప్రశ్నకు మల్టిపుల్ ఆన్సర్స్ ఇచ్చి గందరగోళం సృష్టించారు.

నార్మలైజేషన్ ప్రక్రియ పేరుతో నిర్దిష్ట సెషన్లలో తమకు కావలసిన వారికి ఇష్టారాజ్యంగా 6 మార్కుల వరకు కలిపారు. 0.1 మార్కు తేడాతో వేలాది మంది నిజమైన ప్రతిభావంతులు ఉద్యోగాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు

సెలక్షన్ లిస్ట్ ధిక్కరణ హారిజాంటల్ రిజర్వేషన్

దేశంలో ఏ నియామక ప్రక్రియలోనైనా ముందుగా మెరిట్ లేదా సెలెక్షన్ లిస్ట్ ప్రకటించి, అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత 1:1 నిష్పత్తిలో సర్టిఫికెట్ల పరిశీలన చేస్తారు. కానీ ఇక్కడ ముందుగానే తమ వారికి ఉద్యోగాలు ఇచ్చేసి, ఆ తర్వాత సెలెక్షన్ లిస్ట్ ఇవ్వడం జరిగిందని హారిజాంటల్ రిజర్వేషన్ నిబంధనలను తలకిందులుగా అమలు చేసి అర్హులైన అభ్యర్థులకు మొండిచేయి చూపించారని ఎమ్మెల్సీ పర్వత రెడ్డి మండిపడ్డారు

నిబంధనల ప్రకారం హయ్యెస్ట్ అచీవ్‌మెంట్ సర్టిఫికెట్‌కు సరిపోయే బ్యాకప్ సర్టిఫికెట్ ఉండాలి. కానీ, ఒకరికి హయ్యెస్ట్ సర్టిఫికెట్ వాలీబాల్ ది ఉంటే, బ్యాకప్ కబడ్డీది పెట్టారు. మరొకరికి 2012లో హయ్యెస్ట్ సర్టిఫికెట్ ఉంటే, బ్యాకప్ సర్టిఫికెట్ 2013 నాటిది పెట్టారు. బ్యాకప్ సర్టిఫికెట్ లేదని శంకర్ గోపాల్ అనే జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడిని రిజెక్ట్ చేశారు. కానీ, అధికార పార్టీ రికమండేషన్ ఉన్న అభ్యర్థులకు బ్యాకప్ లేకపోయినా శాప్ ద్వారా లెటర్లు తెప్పించి ఉద్యోగాలు కట్టబెట్టారు. నిబంధనల ప్రకారం సెక్రటరీ మాత్రమే పెట్టాలి, కానీ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా ఉన్న కూన రవికుమార్ నిబంధనలకు విరుద్ధంగా సర్టిఫికెట్లపై సంతకాలు పెట్టారు. ఈ చెల్లుబాటు కాని సంతకాలతో సుమారు 17 మందికి టీచర్ ఉద్యోగాలు ఇచ్చారు. స్కూల్, జూనియర్ లెవెల్ గేమ్స్ పరిగణించకూడదనే నియమం ఉన్నా, కొందరికి ఆ సర్టిఫికెట్ల ఆధారంగా ఉద్యోగాలు ఇచ్చారు. 12 మందికి సంబంధించి తాము తప్పులు చేశామని శాప్ స్వయంగా స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌కు లేఖ రాసినా వాటిని సరిదిద్దలేదు. మామిడాల శివకృష్ణ అనే 72 పాయింట్లు వచ్చిన అర్హుడికి పోస్ట్ ఉందని చూడకపోవడం వల్ల ఉద్యోగం నిరాకరించారు

టెట్ నిబంధనల ఉల్లంఘన, జీవోల ఉపసంహరణ

సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయ ఉద్యోగానికి 'టెట్' క్వాలిఫై కావడం తప్పనిసరి. కానీ, కనీసం టెట్ రాయని వారికి, 2025 టెట్‌లో డిస్క్వాలిఫై అయిన వారికి కూడా ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఇచ్చారు. డీఎస్సీ, టెట్ లేకుండా ఉద్యోగాలు ఇచ్చేలా తీసుకొచ్చిన రెండు వివాదాస్పద జీవోలను, తమ వారికి పోస్టింగులు ఇచ్చుకున్న వెంటనే రాత్రికి రాత్రే ఉపసంహరించుకోవడం ఈ ప్రభుత్వ కుట్రకు నిదర్శనం.

మేము ఈ అక్రమాలన్నింటిపై ఆధారాలతో సహా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాం. డాక్యుమెంట్లు క్రమపద్ధతిలో లేవనే ఒక చిన్న సాంకేతిక కారణంతో, కోర్టు అనుమతితోనే పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకోవడం జరిగిందని తిరిగి మరో రెండు రోజుల్లో సరైన ఆర్డర్‌లో పిటిషన్ దాఖలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్సీ పర్వత రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో దగా డీఎస్సీపై సీబీఐ విచారణ జరిపించే వరకు, లోకేష్ రాజీనామా చేసే వరకు నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రోడ్డెక్కి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా సంఘం లక్ష్మీబాయి యాదవ్ జయంతి వేడుకలు సమావేశం లో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు వెలగల దుర్గారావు.

**జనసముద్రం న్యూస్, కొయ్యలగూడెం మండల రిపోర్టర్ ఈ.మనోహర్, జులై 27,**



సంగం లక్ష్మీబాయి యాదవ్ 126 వ జయంతి స్థానిక బిసి కమ్యూనిటీ హాల్ నందు బీసీ చైతన్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెలగల దుర్గారావు మాట్లాడుతూ స్వాతంత్ర సమర యోధురాలు సామాజిక సేవకురాలు సంఘం లక్ష్మీబాయి యాదవ్ అని తెలిపారు, ఉప్పు సత్యాగ్రహం తో పాటు ఇన్నోవా బాబాయ్ చేపట్టిన భూదాన ఉద్యమంలో కీలకపాత్ర వహించారని తెలిపారు, 1952 నా హైదరాబాదులో శాసనసభ్యులుగా ఎన్నికై ఉప విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు 1957 నుంచి 1972 వరకు మూడుసార్లు వరుసగా నికారాబాద్ పార్లమెంట్ సభ్యురాలుగా ఎన్నికై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తొలి మహిళా పార్లమెంటు సభ్యురాలుగా ఎన్నికైన గుర్తింపు పొందారు మహిళా సంక్షేమ అనాధాశ్రమాలు ఏర్పాటు చేశారు విద్యాసంస్థల స్థాపనకు కృషి చేశారు బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిటికిన రమేష్ మాట్లాడుతూ చేసిన అనేక కార్యక్రమాలు పేద ప్రజలకు ఎంతో ఉపకారం చేసినవని తెలిపారు, ఈ యొక్క కార్యక్రమంలో సిపిఐ కొయ్యలగూడెం మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు జిల్లా ఉపాధ్యక్షులు వీ సం రంగ, మండల వైస్ ప్రెసిడెంట్ బొక్క నరేంద్ర , జల్లిపల్లి రాంబాబు కోన ధై రాజు మట్టపర్తి సత్యనారాయణ గుత్తుల సత్యనారాయణ కామేశ్వరరావు పట్టణ అధ్యక్షులు గొలిశెట్టి సూర్యచంద్రన్ రాయపూడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# దాతల సహకారంతో ముత్యాలపల్లి హైస్కూల్లో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

- **ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్**
- **విద్యార్థులతో రిబ్బన్ కటింగ్ చేయించిన ఎమ్మెల్యే**

**మొగల్తూరు జూలై 27 జనసముద్రం**




మొగల్తూరు మండలం ముత్యాలపల్లి శ్రీ బండి ముత్యాలమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించడానికి వచ్చిన ఎమ్మెల్యేకు ముందుగా ప్రధానోపాధ్యాయులు పి రామరాజు పుష్పగుచ్చం అందజేసి లోపలికి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే నాయకర్ విద్యార్థులతో కంప్యూటర్ ల్యాబ్ రిబ్బన్ కటింగ్ చేయించారు. విద్యార్థులకు సాంకేతిక విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో ముత్యాలపల్లి శ్రీ బండి ముత్యాలమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 16 కంప్యూటర్లు దాతలు, పూర్వ విద్యార్థులు సహకారంతో ఏర్పాటు చేసిన నూతన కంప్యూటర్ ల్యాబ్‌ను శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి విద్యార్థికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని, దాతలు కూడా ముందుకు వచ్చి విద్యాభివృద్ధికిసహకరించడంఅభినందనీయమన్నారు . దాతల సేవాభావాన్ని ఆయన కొనియాడుతూ, ఈ కంప్యూటర్ ల్యాబ్ విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, దాతలు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పెన్‌డౌన్‌లో భాగంగా దస్తావేజు లేఖరుల భిక్షాటన
## జీవో 369 రద్దు చేయాలని ప్రభుత్వానికి వినతి




మొగల్తూరు జూలై 27 జనసముద్రం

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న పెన్‌డౌన్ ఉద్యమంలో భాగంగా మొగల్తూరు దస్తావేజు లేఖర్ల సంఘ అధ్యక్షులు కొల్లాటి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మొగల్తూరు గాంధీ బొమ్మ సెంటర్లో భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు.
ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 369ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖరులు మాట్లాడుతూ, జీవో 369 అమలుతో తమ జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను గుర్తించి జీవోను ఉపసంహరించుకునే వరకు పెన్‌డౌన్ ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. భిక్షాటన ద్వారా సేకరించిన మొత్తాన్ని ప్రభుత్వానికి పంపేందుకు సిద్ధంగా ఉన్నామని, తమ ఆవేదనను ప్రభుత్వం గుర్తించి తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో పలువురు దస్తావేజు లేఖరులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ద్వారకాతిరుమలలో వైభవంగా శాకాంబరి ఉత్సవాలు ప్రారంభం.

జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూలై 27
ద్వారకాతిరుమల ప్రతినిధి.

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఉపాలయమైన క్షేత్రపాలకునిగా విరాజిల్లుతున్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో శాకాంబరి ఉత్సవాలుసోమవారంఘనంగా ప్రారంభమయ్యాయి.ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు శ్రీ భ్రమరాంబ అమ్మవారిని వివిధ రకాల పచ్చని కూరగాయలు, తాజా పండ్లు, అలాగే రకరకాల డ్రై ఫ్రూట్స్‌తో సర్వాంగ సుందరంగా శాకాంబరీ దేవి అలంకరణలో తీర్చిదిద్దారు. అమ్మవారి దివ్య రూపం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. మూడు రోజుల పాటు ఈ వేడుకలు ఘనంగా కొనసాగనున్నాయి.ఈ పవిత్ర ఉత్సవాల ప్రారంభ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు



- శ్రీ భ్రమరాంబ అమ్మవారు శాకాంబరీ దేవి అలంకరణ.

.ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

# 29 నుంచి మూడు రోజులపాటు..
## భ్రమరాంభ సమేత మల్లేశ్వర స్వామివారి ఆలయంలో వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు, హోమాలు..



శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర ఆలయం

జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూలై 27
ద్వారకాతిరుమల ప్రతినిధి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా వర్ధిల్లేందుకు మరియు లోక కళ్యాణార్థం ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.పండితుల సూచన మేరకు మరియు దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలననుసరించి, శ్రీవారి ఉపాలయమైన శ్రీ భ్రమరాంభ సమేత మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 29వ తేదీ నుండి 31వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.
వరుణ దేవుని అనుగ్రహం కోసం ఈ వేడుకల్లో భాగంగా వరుణ సూక్త పారాయణాలు, వారుణానువాక జపాలు, రుద్ర హోమం మరియు సహస్ర ఘటాభిషేకం తదితర పవిత్ర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతులు, ప్రజలు అన్ని విధాలా సుఖసంతోషాలతో ఉండాలని ఈ పూజలు చేపట్టినట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి.కావున భక్తులందరూ ఈ కార్యక్రమాలకు పెద్దఎత్తున విచ్చేసి, స్వామివారి కృపకు పాత్రులై తీర్థప్రసాదాలు స్వీకరించవలసిందిగా దేవస్థాన అధికారులు కోరుతున్నారు.

# 29 నుంచి కుంకుళ్లమ్మ సారే ఉత్సవాలు.

జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూలై 27
ద్వారకాతిరుమల ప్రతినిధి.

ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఉపాలయమైన క్షేత్ర దేవతగా విరాజిల్లుతున్న శ్రీ కుంకుళ్ళమ్మ వారి ఆలయంలో ఆషాడ మాస పర్వదినాన్ని పురస్కరించుకుని సందర్భంగా ఆడపడుచులు అమ్మవారి ఆషాఢ మాస సారే సమర్పణ ఉత్సవాలు ఈ నెల 29వ తేదీ నుంచి వైభవంగా జరగనున్నాయి.ఆలయ ప్రధాన అర్చకులు భైరవ స్వామి మాట్లాడుతూ...జూలై 29 నుంచి ఆగస్టు 12వ తేదీ వరకు 15 రోజుల పాటు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతాయి. ఉత్సవాల్లో భాగంగా 29వ తేదీన తొలి రోజున అమ్మవారికి సారే సమర్పణ కార్యక్రమం నిర్వహిస్తారు. ద్వారకాతిరుమల దేవస్థానం ఆధ్వర్యంలో కార్యనిర్వహణ అధికారి వి త్రినాథరావు దంపతులు ఈ కార్యక్రమాన్ని వేదమంత్రాలతో, ప్రత్యేక అలంకరణలతో నిర్వహించనున్నారు.ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి నిత్య పూజలు, అభిషేకాలు, జరుగుతాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.గ్రామస్థులు, భక్తులందరూ ఈ పవిత్ర ఉత్సవాల్లో ప్రతిరోజూ పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ప్రధాన అర్చకులు ,అధికారులు కోరారు.



శ్రీ కుంకుళ్ళమ్మ అమ్మవారు.

# వికసిత్ వైబ్రెంట్ విలేజ్ ప్రోగ్రామ్2026 పాల్గొన్న యువతతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ ముఖాముఖి
## నెల్లూరు జిల్లా నుంచి ఎంపికైన కుమారి టి. ఆర్తి చైతన్య పాల్గొనడం గర్వకారణం

నెల్లూరు, జూలై 26 జనసముద్రం జిల్లా ప్రతినిధి

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మై భారత్ నిర్వహించిన వికసిత్ వైబ్రెంట్ విలేజ్ ప్రోగ్రామ్ 2026 లో దేశవ్యాప్తంగా ఎంపికైన 400 మంది యువ ప్రతినిధులతో గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నుండి జాతీయ స్థాయిలో ఎంపికైన కుమారి టి. ఆర్తి చైతన్య ఈ ప్రత్యేక వర్చువల్ సమావేశంలో భాగస్వామి కావడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.
వికసిత్ వైబ్రెంట్ విలేజ్ ప్రోగ్రామ్2026లో భాగంగా దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన యువత లడఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని 74 సరిహద్దు గ్రామాలను సందర్శించి, స్థానిక ప్రజలతో కలిసి నివసిస్తూ స్వచ్ఛత కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలు, సాంస్కృతిక మార్పిడి, యువ సమ్మేళనాలు, వృక్షారోపణ, గ్రామ పాలనపై అవగాహన, వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగిన ప్రాంతాల సందర్శన తదితర కార్యక్రమాలలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసార వీక్షణ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ఎ.వి. నరసింహ కుమార్ సెట్ నల్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగేశ్వరరావు జిల్లా సమాచార అధికారి సురేష్ పాల్గొన్నారు. అలాగే మై భారత్‌కు చెందిన 20 మంది వాలంటీర్లు ప్రధానమంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించి ఆయన సందేశాన్ని ఆలకించారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యువతతో మాట్లాడుతూ, సరిహద్దు




గ్రామాలను దేశ అభివృద్ధికి కేంద్ర బిందువులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో వికసిత్ వైబ్రెంట్ విలేజ్ ప్రోగ్రామ్‌ను రూపొందించామని తెలిపారు. సరిహద్దు గ్రామాలను దేశపు తొలి గ్రామాలుగా భావించి వాటి అభివృద్ధిలో యువత చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. దేశభక్తి, సేవాభావం, సామాజిక బాధ్యత, జాతీయ సమైక్యత వంటి విలువలను యువత మరింత బలోపేతం చేయాలని సూచించారు.
ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి ఎ.వి. నరసింహ కుమార్మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన కుమారి టి. ఆర్తి చైతన్యను అభినందించారు.మై భారత్ ద్వారా యువతకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని మరింత మంది యువత జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.
అనంతరం సెట్నెల్ సీఈఓ నాగేశ్వర రావు మాట్లాడుతూ యువత కు ఇటువంటి అవకాశాలు రావటం చాలా మంచి విషయం అని ఆర్తి చైతన్య ను



అభినందించారు.
ఈ కార్యక్రమాన్ని వీక్షించిన యువత ప్రధానమంత్రి సందేశం తమలో దేశసేవ పట్ల మరింత స్ఫూర్తిని నింపిందని, భవిష్యత్తులో మై భారత్ నిర్వహించే కార్యక్రమాలలో మరింత చురుకుగా పాల్గొంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు ఎన్.ఐ.సి జిల్లా సమాచార అధికారి సురేష్, సెట్నెల్ సి ఈ ఓ నాగేశ్వర రావు, జిల్లా యువజన అధికారి ఎ.వి నరసింహ కుమార్, మై భారత్ వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల విద్యకు వెన్నెముక తల్లికి వందనం..!



-ఒకే ఇంట్లో ఏడుగురి బిడ్డలకు నగదు జమ
-కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు

జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, వెల్దుర్తి మండలం, జూలై 27;

బడులు తెరిచే సమయానికి తమ బిడ్డల విద్యకు “తల్లికి వందనం పథకం“ వెన్నెముకగా నిలుస్తోందని వెల్దుర్తి మండల పరిధిలోని పాపిరెడ్డికుంట తండాకు చెందిన తల్లిదండ్రులు కాంద్లావత్ సామ్లా నాయక్,నాగేశ్వరి భాయి లు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. వారి ఏడుగురి పిల్లలకు కూటమి ప్రభుత్వం నగదు జమ చేసిందని తెలిపారు. గత ఏడాది ఆరుగురి కుమార్తెలకు తల్లికి వందనం పథకం ద్వారా నగదు జమకాగా.., ఈ ఏడాది తన కుమారుడికి కూడా ఈ పథకానికి ఎలిజిబుల్ అయ్యారని చెప్పారు. తన పెద్ద కుమార్తె రూపాబాబు విజయపురిసౌత్ లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల నందు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుండగా.., రెండు, మూడవ సంతానమైన కీర్తన బాయి, నవ్య బాయి లు కూడా అదే పాఠశాల నందు తొమ్మిది,ఏడు తరగతుల్లో విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. అలానే నాలుగొవ సంతనమైన ఆశా బాయి శిరిగిరిపాడులోని శ్రీ సరస్వతి విద్యానికేతన్ నందు 6వ తరగతి, ఐదు,ఆరు సంతానం కమల పిల్లలైన హరిత బాయి, సరిత బాయి ఇరువురు 3వ తరగతి, ఏడొవ సంతానం అయిన అభిషేక్ నాయక్ 1వ తరగతి పాపిరెడ్డికుంట తండాలోని ప్రభుత్వ ప్రాథమికొన్నత పాఠశాల నందు విద్యనభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తానని ఆనాడు ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి తన ఏడుగురి పిల్లలకు తల్లికి వందనం నగదు తన భార్య ఖాతాలో జమ చేయడం పట్ల తమకు కూటమి ప్రభుత్వంపై మరింత నమ్మకాన్ని పెంచిందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. పాఠశాలలు తెరిచే సమయానికి తన ఏడుగురి బిడ్డలకు తల్లికి వందనం పథకం ద్వారా నగదు జమ చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు.

# అభివృద్ధి,సంక్షేమమే ధ్యేయంగా అడుగులు :
## టీడీపీ యువనేత జూలకంటి గౌతమ్ రెడ్డి

- విజయపురిసౌత్ లో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న గౌతమ్ రెడ్డి
- రెండేళ్ల పాలన లో రాష్ట్ర ప్రగతికి ప్రజలకు వివరించిన యువనేత

జనసముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి జులై 27

విజయపురిసౌత్: సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి,సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి తనయుడు,టీడీపీ యువ నేత జూలకంటి గౌతమ్ రెడ్డి అన్నారు.సోమవారం విజయపురిసౌత్ లో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఫిల్టర్ హౌస్,దేశవరపు క్యాంపు తండా,మెయిన్ బజార్,డౌన్ మార్కెట్,మత్యకారుల కాలనీ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి రెండేళ్ళలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి ,సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు.
అలాగే స్థానికులు ఆయనకు పిర్యాదు చేసిన స్థానిక సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు.ముందుగా స్థానిక సీతారామాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అబ్దుల్ కలాం విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అలాగే దేశవరపు క్యాంపు తండాలోని సేవాలాల్ మహరాజ్ ఆలయం లో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.జూలకంటి గౌతమ్ రెడ్డి ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమానికి



విశేష స్పందన రావడంతో కార్యకర్తలు,నాయకుల్లో హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్,స్థానిక టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు,జనసేన అధ్యక్షుడు రాహుల్,వజ్రం నాయక్,రామిశెట్టి సైదారవు,సుధాకర్ రెడ్డి,గుండాల శ్రీను,శేరెడ్డి గోపిరెడ్డి,ఎరిపల్లి వెంకటేశ్వర్లు,మైలపల్లి అప్పలరాజు, బసివిరెడ్డి,బొబ్బిలి చంద్రశేఖర్,సిహెచ్ అప్పలరాజు,వస్తుపూరి శ్రీరామూర్తి,మస్తాన్, సత్తిబాబు,గంటా ధనుంజయరావు,రాంచంద్,పవన్ షాజీర్,తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యం-టిడిపి నాయకులు







**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, జూలై 27:**
బడుగు బలహీన వర్గాల సంక్షేమ అభివృద్ధే కూటం ప్రభుత్వం లక్ష్యమని టిడిపి నాయకులు అన్నారు ఒంటిమిట్ట జడ్పిటిసిఅద్దలూరు ముద్దుకృష్ణారెడ్డి టిడిపి నాయకులు బొడ్డే వెంకటరమణ నాయుడఒంటిమిట్ట మండలం మంటపంపల్లి చింతరాజుపల్లి పెన్నా పేరూరు టిడిపి మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి క్లస్టర్ ఇంచార్జి తుమ్మలగుంట ఈశ్వరయ్య చెంచు గారి పల్లెలో టిడిపి నాయకులు బొబ్బిలి రాయుడు సోమవారం డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ఒంటిమిట్ట మండలం మంటపం పల్లి పంచాయతీ మర్కుడు పల్లి గ్రామం చింతరాజు పల్లి పంచాయతీ బోయపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో "డోర్ టు డోర్" కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి లినారా చంద్రబాబు నాయుడు మరియు యువ నాయకుడు నారా లోకేష్ చమ్మర్తి జగన్మోహన్ రాజు రాజంపేట టిడిపి ఇన్చార్జ్ లి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత 2 సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రారంభించింది. తల్లికి వందనం, రైతు భరోసా, పేదలకు ఇళ్లులి ప్రతి ఇంటికి మూడు సిలిండర్లు చేనేతలకి 200 యూనిట్లు పవర్లూమ్స్ కి 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఆటో డ్రైవర్లకు ఏటా 15000 ఎన్టీఆర్ వైద్య సేవలో పేదలకు ఉచిత వైద్య సేవలు సీఎంఆర్ఎఫ్ ద్వారా లక్షల కుటుంబాలకు ఆర్థిక సాయం మత్స్యకార సేవలో ఏటా 20,000 269 అన్నా క్యాంటీన్ల ద్వారా ఐదు రూపాయలకే భోజనం అన్నదాత సుఖీభవ ఏటా ఇరవై వేల రూపాయలు ప్రతి రైతుకి వికలాంగుల పెన్షన్లు వృద్ధులు పింఛన్లు శ్రీ శక్తి పథకం లాంటి పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి నేరుగా లబ్ధి చేకూరుతుంది. యువతకు ఉపాధి, రైతులకు భరోసా, మహిళలకు రక్షణ కల్పించడమే మా ప్రభుత్వ లక్ష్యం" అని తెలిపారు.

ప్రజల వద్ద ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, విధ్వంసంపై ప్రజలను అప్రమత్తం చేశారు.

ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు అపూర్వ స్పందన తెలిపారు. తమకు అందుతున్న పథకాలపై సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ముద్దుకృష్ణారెడ్డి బొడ్డే వెంకటరమణ ఎంపీటీసీసుంకేసుల భాష కమతం చంద్రమౌళి నాయుడు బూత్ కన్వీనర్ పుల్లారెడ్డి వెంకటసుబ్బయ్య శివ టిడిపి ప్రధాన కార్యదర్శిఆలూరు వెంకటసుబ్బయ్య హరికృష్ణ రెడ్డి మహీం భాష సుభాన్ భాష ప్రతాపరెడ్డి ప్రసాద్ రెడ్డి సునీల్ కుమార్ రెడ్డి సునీల్ రవి రమేష్ ప్రభాకర్ రామ లక్ష్మయ్య సతీష్ సుబ్బయ్య మరియు పెద్ద సంఖ్యలో టీడీపీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వీఆర్సీ గ్రౌండ్‌లో జాతరలా సైకిళ్ల పంపిణీ

- 7 వేల మంది ప్రభుత్వ విద్యార్థులకు మంత్రి నారాయణ కుటుంబం నుంచి ఉచిత సైకిళ్లు
- రూ.6 కోట్లతో 10 వేల సైకిళ్ల పంపిణీకి శ్రీకారం,తొలి విడతలో 7 వేలు అందజేత
- నేను పేదరికాన్ని అనుభవించాను ఆ కష్టం మరో పిల్లవాడికి రాకూడదు మంత్రి నారాయణ







**నెల్లూరు, జూలై 27 : జనసముద్రం జిల్లా ప్రతినిధి.**
వీఆర్సీ గ్రౌండ్ సోమవారం అక్షరాలా జాతరను తలపించింది. వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ట్రంక్ రోడ్డు, వీఆర్సీ గ్రౌండ్ కిక్కిరిసిపోయాయి. థాంక్యూ నారాయణ సార్ అంటూ విద్యార్థుల నినాదాలతో ప్రాంగణం మార్మోగింది. నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 7 వేల మంది విద్యార్థులకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కుటుంబం సొంత నిధులతో ఉచిత సైకిళ్లు పంపిణీ చేసింది. మొత్తం 10 వేల మంది విద్యార్థులకు రూ.6 కోట్ల వ్యయంతో సైకిళ్లు అందించే కార్యక్రమంలో తొలి విడతగా ఈ పంపిణీ చేపట్టారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ తన జీవిత ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు. "నేను పేదరికాన్ని పుస్తకాల్లో చదవలేదు.జీవితంలో అనుభవించాను. గుడిసెలో పుట్టి, హరనాథపురం నుంచి వీఆర్సీ వరకు కాలినడకన వెళ్లి చదివాను. మా నాన్న ప్రైవేట్ బస్సు కండక్టర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషించారు. అప్పుడే బాగా చదివి పేదరికాన్ని జయించాలని నిర్ణయించుకున్నాను" అని భావోద్వేగంగా చెప్పారు.

ఎన్నికల సమయంలో 80 వేల ఇళ్లు తిరిగినప్పుడు పేద విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తనను కలచివేశాయని, వారికి నాణ్యమైన విద్యను ఆస్తిగా అందిస్తానని అప్పుడే నిర్ణయించుకున్నానని తెలిపారు.

తాను చదివిన వీఆర్సీ విద్యాసంస్థను రూ.17 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దామని, ప్రస్తుతం అక్కడ 1,100 మంది నిరుపేద విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. నగరంలోని మరో 14 ప్రభుత్వ హైస్కూళ్లను ఆధునీకరిస్తున్నామని, వక్ఫ్ బోర్డు స్థలంలో రూ.20 కోట్ల సీఎస్ఆర్ నిధులతో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నారాయణ విద్యాసంస్థల మెటీరియల్‌ను ఉచితంగా అందించి, ఆగస్టు 1 నుంచి ఐఐటీ ఫౌండేషన్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. నేను నడిచి వెళ్లిన కష్టాలు ఈ తరం పిల్లలకు ఉండకూడదు. అందుకే సైకిళ్లు ఇస్తున్నాం. ఇవి కేవలం వాహనాలు కావు,మీ కలలకు చక్రాలుఅని విద్యార్థులకు పిలుపునిచ్చారు.కుటుంబ సభ్యులతో చర్చించి రూ.6 కోట్లతో 10 వేల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు అందించాలని నిర్ణయించామని, తొలి విడతలో 7 వేల మందికి పంపిణీ చేశామని, మిగిలిన 3 వేల మందికి జనవరిలో అందజేస్తామని తెలిపారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను అభినందించిన మంత్రి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమానికి తన వంతు సహకారం అందిస్తానని ప్రకటించారు.

నాన్న స్ఫూర్తితోనే మా సేవా కార్యక్రమాలు

మంత్రి కుమార్తె పొంగూరు సింధుర మాట్లాడుతూ సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తన తండ్రి కష్టపడి చదివి ఈ స్థాయికి చేరుకున్నారని, అదే స్ఫూర్తితో పేద విద్యార్థుల కోసం సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.

పొంగూరు షరణి మాట్లాడుతూ నెల్లూరులోని ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్లాలన్నదే తమ కుటుంబ లక్ష్యమని తెలిపారు.

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ మంత్రి నారాయణ చేపడుతున్న కార్యక్రమాలు పేద విద్యార్థులను సాధికారత వైపు నడిపిస్తున్నాయని కొనియాడారు. బాలికలకు ఈ సైకిళ్లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పేద పిల్లల భవిష్యత్తు కోసం మంత్రి కుటుంబం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. వేలాది మంది విద్యార్థుల కళ్లల్లో కనిపించిన ఆనందమే ఈ కార్యక్రమం విజయానికి నిదర్శనమన్నారు.మేయర్ దేవరకొండ సుజాత మాట్లాడుతూ ఒకే రోజు 7 వేల సైకిళ్ల పంపిణీ చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు.

రూరల్ ఎంఎల్ఏ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ అడగ్గానే సైకిళ్ళు నెల్లూరు రూరల్ కి ఇచ్చిన గొప్ప వ్యక్తి మంత్రి నారాయణ అని కొనియాడారు.రూరల్ అభివృద్ధికి నారాయణ సార్ కుటుంబం ఎప్పుడు అండగా ఉండాలని కోరారు.

రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ఈరోజు చాలా సంతోషమైన రోజన్నారు.కార్పొరేట్ కి దీటుగా పేద పిల్లలకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించాలని నారాయణ సార్ సంకల్పించారని తెలిపారు.నారాయణ మెటీరియల్ ఉచితంగా వచ్చి ఐఐటీ ఫౌండేషన్ ఇచ్చి ఎంతో మంది పేద విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చారన్నారు.నిరుపేద పిల్లల చదువుకు నేనున్నానని బరోసా కల్పిస్తున్నారన్నారు.వక్ఫ్ బోర్డు స్థలంలో 20 కోట్ల సీఎస్ ఆర్ ఫండ్స్ తో అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మిస్తున్నారని తెలిపారు.

నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఇది గిన్నిస్ బుక్‌లో నమోదయ్యే స్థాయి కార్యక్రమమని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్,మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి,అల్లుళ్ళు పునీత్,గంటా రవితేజ,నారాయణ విద్యాసమస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి,రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డి,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ,సంతపేట ఆంజనేయస్వామి ఆలయ చైర్పర్సన్ విజేతా రెడ్డి ,నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు టీడీపీ నేతలు జహీర్,బాలాజీ,తిరుమల నాయుడు,కిన్నెర మాల్యాద్రి ,మొయినుద్దీన్,కర్తం ప్రతాప్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# హెక్టగుడ రచ్చబండ వివాదం.

- క్షేత్రస్థాయి విచారణ జరపాలి.
- అనంతగిరి ఏవోకు వినతిపత్రం సమర్పించిన జనసేన నాయకులు



**అనంతగిరి, జనసముద్రం న్యూస్ జూలై 28**
ఎగువశోభ పంచాయతీ హెక్టగుడలో మిత్రపక్షాలకు కనీస సమాచారం లేకుండా రచ్చబండ ప్రారంభోత్సవం నిర్వహించిన ఉదంతంపై జనసేన పార్టీ తమ నిరసనను మరింత ఉధృతం చేసింది. ఈ వ్యవహారంలో జరిగిన నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర క్షేత్రస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ అనంతగిరి మండల జనసేన పార్టీ నాయకులు మండల వ్యవసాయ అధికారి (ఏవో) గారికి వినతిపత్రం సమర్పించారు.రచ్చబండ ప్రారంభోత్సవంలో పారదర్శకత లోపించిందని, నిధుల వినియోగంలో నిజాలను దాచిపెట్టేందుకే మిత్రపక్షాలకు సమాచారం ఇవ్వకుండా దొంగచాటుగా ఈ కార్యక్రమాన్ని కానిచ్చేశారని జనసేన నాయకులు ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజా ధనంతో జరిగే కార్యక్రమాలను ఏకపక్షంగా నిర్వహించడం కూటమి ధర్మానికి విరుద్ధమని వారు స్పష్టం చేశారు. ఈ అక్రమాలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ వినతిపత్రం సమర్పించిన వారిలో అనంతగిరి జనసేన మండల అధ్యక్షుడు చిట్టం మురళి, కార్యదర్శి లక్ష్మణ్, ముఖ్య నాయకులు బొంజు బాబు, రామరాజు, జమ్మరావు, మరియు చిన్న మధు తదితరులు ఉన్నారు.

# మండల టీడీపీ అధ్యక్షులు గుబ్బల నాగరాజు జన్మదిన వేడుకలు








**మొగల్తూరు, జూలై 27 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**
మొగల్తూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుబ్బల నాగరాజు జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం జి ఎన్ ర్ కాంప్లెక్స్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గుబ్బల నాగరాజు పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ఆయన మంచి ఆరోగ్యం, ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం గుబ్బల నాగరాజు మాట్లాడుతూ తనకు పుట్టినరోజు శు భాకాంక్షలు తెలిపిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో పార్టీకి తన వంతు సహాయ పుష్కలంగా అందిస్తానని అన్నారు. లోకల్ బాడీ ఎలక్షన్ కు నియోజకవర్గం నాయకులు కార్యకర్తలు రెడీగా ఉండాలని నిరంతరం కూటమి పార్టీ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో నరసాపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణ, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆర్గనైజర్ రవీంద్రనాథ్ ఠాగూర్, సొసైటీ చైర్మన్ నిప్పులేటి తారకరామారావు, సొసైటీ డైరెక్టర్ మైలాబత్తుల రాంబాబు, కవురు నాగేశ్వరావు, మార్కెట్ యార్డ్ బోర్డ్ డైరెక్టర్ మెందు రాజేష్, ముక్కు పుల్లయ్య నాయుడు, దేశం శెట్టి శ్రీనివాస్, లక్కు బాలాజీ, టిడిపి మొగల్తూరు టౌన్ అధ్యక్షులు బొల్లా చంటి, మాజీ సర్పంచ్ మామిడిశెట్టి సత్యనారాయణ, పాలా రాంబాబు, మరియు నియోజకవర్గ పరిధి కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల దాహార్తి తీర్చిన మంత్రి మండిపల్లి

**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ జూలై,27**
లక్కిరెడ్డిపల్లి మండలం కస్తూరి రాజు పల్లి పంచాయతీ పరిధిలోని గురయ్య పల్లికి చెందిన ప్రజలు మరియు కుర్నూతుల గ్రామం ఎగువ వడ్డేపల్లికి చెందిన ప్రజలు గత కొన్ని రోజులుగా తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను స్థానిక గ్రామీణ ప్రజలు గ్రామ టీడీపీ నాయకులు, మండల అధ్యక్షుడు యనమల మదన్ మోహన్ దృష్టికి తీసుకెళ్లారు.ఆయన ఈ విషయాన్ని మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మరియు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు తాగునీటి సమస్య ఉండకూడదనే ఉద్దేశంతో వారు వెంటనే స్పందించి, తమ సొంత నిధులతో ఆయా ప్రాంతాల్లో బోరు వేయించడం జరిగింది.

ఈ బోరులో నీరు పుష్కలంగా పడడంతో గ్రామ ప్రజల తాగునీటి కష్టాలు తీరాయి. తమ ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి మరియు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డికి గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.



# ఉచిత హోమియోపతి క్యాంపు నందు అన్నప్రసాద భోజనాల పంపిణీ





**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, కారంపూడి, జూలై 27;**
పల్నాడు జిల్లా కారంపూడి పట్టణంలోని శ్రీ కొత్త రామకోటయ్య తాతగారి బాలభాను విద్యాలయం నందు ప్రతి నెల చివరి వారంలో ఉచిత హోమియోపతి మరియు మందులు పంపిణీ కార్యక్రమానికి విచ్చేసే కారంపూడి ప్రాంత ప్రజలు లకు శ్రీ వాసవి సేవా అన్న ప్రసాద కమిటీ పర్యవేక్షణలో శాశ్వతదాతలుగా బొగ్గారపు శ్రీనివాసరావు ధర్మపత్ని రాజ్యలక్ష్మి కుమారులు రామకృష్ణ ప్రసాద్, వెంకట సిద్ధార్థ మరియు కుటుంబ సభ్యులు సహకారం అందించారు. బొగ్గవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఉచిత హోమియోపతి మందులకు వచ్చే ప్రజలకు నారాయణ సేవలో భాగంగా అన్నప్రసాద భోజనాలు పంపిణీ చేయడం తమకు ఎంతో సంతోషంగా ఉందని ఇటువంటి సేవా కార్యక్రమాలకు అందరూ సహాయ సహకారాలు అందించి ముందుకు నడిపించాలని కొనియాడారు. ఈ నారాయణ సేవా కార్యక్రమంలో ఉచిత హోమియోపతి నిర్వాహకులు శివానందం, అన్న ప్రసాద కమిటీ ఫౌండర్ భవిరిశెట్టి రామారావు, బోల్నేడి శివ , గుండా సుబ్బారావు, అన్న ప్రసాద మహిళా కమిటీ సభ్యులు చిన్ని లక్ష్మి ,వుటుకూరి వాణి, సూరేధనలక్ష్మి, చిన్ని అనంతలక్ష్మి, గుండా మహేశ్వరి, బచ్చు కోటేశ్వరి చింతా. రాజి పల్లా పద్మ, సముద్రాల పద్మ, మాడిశెట్టి పుష్పలత, మిట్టపల్లి. రమాదేవి, పొట్టుమూర్తి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

Published by Rajeshwari Publications,D.No.4-3-99-1,Anantapur 515001 Rege: R.N.I.No APTEL/2021/16151 for Queries Contact us @ 94941 84136, janasamudram2021@gmail.com. Follow us on www.janasamudram.com,fb/janasamudram

# గుండెకెదురుగా గుండె నిలిపిన మాజీ సైనికుల పోరాటానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు

## ప్రభుత్వం వెంటనే మాజీ సైనికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి -- ఎస్. నిసార్ అహమద్

**జనసముద్రం న్యూస్, మదనపల్లె, జూలై 27:**

దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన మాజీ సైనికులు న్యాయమైన హక్కుల సాధన కోసం చేస్తున్న ఉద్యమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త ఎస్. నిసార్ అహమద్ తెలిపారు.

మదనపల్లెలో మాజీ సైనికులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, దేశ సరిహద్దుల్లో అపార త్యాగాలు చేసిన మాజీ సైనికుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం అత్యంత బాధాకరమన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి, వారికి తగిన గౌరవం, భద్రత, సంక్షేమాన్ని ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానికంగా వివాదంలో ఉన్న సైనిక భవన్ కు కేటాయించిన స్థలాన్ని మాజీ సైనికులకు అప్పగించాలని, వెంకప్పకోటలో మాజీ సైనికులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను వెంటనే వారికి అందించాలని డిమాండ్ చేశారు.





మదనపల్లె మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ జింకా చలపతి మాట్లాడుతూ దేశ భద్రత కోసం జీవితాలను అంకితం చేసిన మాజీ సైనికుల పట్ల సమాజం, ప్రభుత్వాలు ప్రత్యేక బాధ్యతతో వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. వారి పోరాటం రాజకీయాలకు అతీతమైనదని, న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి. ఎస్. రెడ్డి, మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు నాయుడు, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దింటి కిషోర్, కార్యదర్శి ఎస్.కె. ఇర్ఫాన్, యువజన నాయకులు హేమంత్, నాగరాజ రెడ్డి, యోగానంద రెడ్డి, చిప్పిలి మల్లికార్జున రెడ్డి, నాగిరెడ్డి, ఎన్. నవాజ్, తాళే సుబ్రహ్మణ్యం, షేక్ జబి లతో పాటు అనుబంధ విభాగాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాజీ సైనికులకు సంఘీభావం తెలిపారు.

# ఇండియా స్కిల్స్ కాంపిటీషన్,2026-27కు యువత భారీ సంఖ్యలో నమోదు చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



**నెల్లూరు, జులై 27, జన సముద్రం జిల్లా ప్రతినిధి.**

యువతలో నైపుణ్యాలను పెంపొందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే అవకాశాలను కల్పించేందుకు నిర్వహిస్తున్న ఇండియా స్కిల్స్ కాంపిటీషన్, 2026-27లో అర్హత కలిగిన యువత అధిక సంఖ్యలో పాల్గొని నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఐ.ఏ.ఎస్. పిలుపునిచ్చారు.

సోమవారం తిక్కన ప్రాంగణం లో జిల్లా కలెక్టర్ ఇండియా స్కిల్స్ కాంపిటీషన్,2026-27 పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నైపుణ్యాభివృద్ధి ద్వారా యువతకు దేశ, విదేశీ స్థాయిలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తున్నాయని తెలిపారు.

ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి రాష్ట్ర, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.

భారత ప్రభుత్వం, నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్కిల్ ఇండియా, వరల్డ్ స్కిల్స్ ఇండియా భాగస్వామ్యంతో ఈ పోటీలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఈ పోటీలు యువతలో సాంకేతిక నైపుణ్యాలు, సృజనాత్మకత, నవీన ఆలోచనలు, సమస్యల పరిష్కార సామర్థ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.

ఈ పోటీల్లో మొత్తం 63 నైపుణ్య విభాగాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ, ఇండస్ట్రీ 4.0, మెకాట్రానిక్స్, రోబోట్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్, క్లౌడ్ కంప్యూటింగ్, ఆటోమొబైల్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్, వెల్డింగ్, వెబ్ టెక్నాలజీస్, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, ఫ్యాషన్ టెక్నాలజీ, బ్యూటీ థెరపీ, హెవీ వెహికల్ టెక్నాలజీ, ప్లంబింగ్, రిన్యూవబుల్ ఎనర్జీ, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించబడతాయని వివరించారు.

వయోపరిమితి

01 జనవరి 2003 లేదా ఆ తరువాత జన్మించిన వారు కొన్ని ఎంపిక చేసిన టీమ్ మరియు వ్యక్తిగత నైపుణ్య విభాగాలకు అర్హులు.

01 జనవరి 2006 లేదా ఆ తరువాత జన్మించిన వారు మిగతా వ్యక్తిగత నైపుణ్య విభాగాలకు అర్హులు.

పోటీల నిర్వహణ దశలు

జిల్లా, రాష్ట్ర, ప్రాంతీయ , జాతీయ, అంతర్జాతీయ (వరల్డ్ స్కిల్స్) స్థాయిలలో పోటీలు నిర్వహించబడతాయి.

జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన అభ్యర్థులు భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ అంతర్జాతీయ వరల్డ్ స్కిల్స్ పోటీలలో పాల్గొనే అవకాశం పొందుతారు.

అర్హత కలిగిన యువత SIDH పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతి యువకుడు, యువతి సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను ప్రపంచ వేదికపై ప్రదర్శించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్వో శ్రీ విజయ కుమార్, జిల్లా ఉపాధి కల్పన అధికారి వినయ్ కుమార్, సెట్నెల్ సిఈవో. నాగేశ్వరరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారి అబ్దుల్ ఖయ్యూం, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో విజయవంతంగా 'ఎస్ఐఆర్' ప్రక్రియ పూర్తి

- 85.28 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేశాం: జిల్లా కలెక్టర్ హిమాన్షు శు
- 'సర్' ప్రక్రియ పూర్తి కావడానికి అహర్నిశలు శ్రమించిన జిల్లా అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపిన కలెక్టర్



**నెల్లూరు, జులై 27, జన సముద్రం జిల్లా ప్రతినిధి.**

నెల్లూరు జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు.

సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, గణాంకాలు, తదుపరి చర్యలపై కలెక్టర్ వివరాలు వెల్లడించారు.

జూన్ 15 నుంచి జూలై 24 వరకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. జిల్లాలోని మొత్తం 19,74,240 మంది ఓటర్లలో 16,83,557 మంది నుంచి ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించి 85.28 శాతం మ్యాపింగ్ పూర్తి చేసినట్లు చెప్పారు.


మ్యాపింగ్ పూర్తైన వారిలో 83.5 శాతం మందిని 2002 ఓటర్ల జాబితాతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల వివరాల ఆధారంగా అనుసంధానం చేయడం జరిగిందని, ఇది రాష్ట్రంలోనే ఒక విశేషమైన పురోగతిగా పేర్కొన్నారు.

మ్యాపింగ్ కాని 1.8 శాతం మంది ఓటర్లకు భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన 12 రకాల అధికారిక గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి సంబంధిత ఈఆర్ఓకు సమర్పిస్తే వారి ఓటు హక్కు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో 38,645 డూప్లికేట్ ఓట్లు (1.96 శాతం) గుర్తించామని, సంబంధిత ఓటర్ల అంగీకారంతో వాటిని తొలగిస్తామని తెలిపారు. అలాగే 1,13,421 మంది (5.75 శాతం) శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిగా, 80,699 మంది (4.09 శాతం) మరణించిన వారిగా, 57,077 మంది (2.89 శాతం) అందుబాటులో లేని వారిగా గుర్తించినట్లు వివరించారు. ఉపాధి నిమిత్తం తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి వచ్చి అవసరమైన ఆధారాలు సమర్పిస్తే వారి ఓటు హక్కును పునరుద్ధరిస్తామని తెలిపారు.

ఈ నెల 31వ తేదీన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని, అనంతరం దానిని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడంతో పాటు గుర్తింపు పొందిన ఎనిమిది రాజకీయ పార్టీలకు ప్రింట్, పెన్‌డ్రైవ్ రూపంలో అందజేస్తామని చెప్పారు. డ్రాఫ్ట్ ప్రచురణ అనంతరం 30 రోజుల పాటు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని, అర్హులైన ఓటర్లు తమ పేర్లు లేకపోయినా లేదా వివరాల్లో లోపాలు ఉన్నా సంబంధిత ఈఆర్ఓ, ఏఈఆర్ఓలను సంప్రదించి సవరించుకోవచ్చన్నారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ఒకరికి ఒకే ఓటు ఉండేలా చూడటమే భారత ఎన్నికల సంఘం లక్ష్యం. సీఈఓ వివేక్ యాదవ్ సూచనలు సలహాల మేరకు జిల్లాలో సర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేయగలిగాం. అలాగే గత 45 రోజులుగా సెలవులు కూడా తీసుకోకుండా రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసిన సచివాలయ సిబ్బంది, బీఎల్‌వోలు, తాసిల్దార్లు, ఆర్‌డీవోలు, ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న అన్ని శాఖల అధికారులకు నా ప్రత్యేక అభినందనలు," అని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పేర్కొన్నారు. సర్ ప్రక్రియలో కీలకంగా పనిచేసి విజయవంతం చేసిన జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్ఓ విజయ్ కుమార్ ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

# అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన నవులూరి శివారెడ్డి



అబ్దుల్ కలాం, భారత మాజీ రాష్ట్రపతి.



నవులూరి శివారెడ్డి,
అమరావతి పార్టీ మాచర్ల,
సత్తెనపల్లి అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యే అభ్యర్థి.

**జనసముద్రంన్యూస్, మాచర్ల నియోజకవర్గం, జూలై 27;**

"కలలు కనండి... ఆ కలలను నిజం చేసుకునే వరకు విశ్రమించకండి" అని యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన మహనీయుడు, భారత రత్న డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం. జూలై 27న ఆయన వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన నవులూరి శివారెడ్డి మాట్లాడుతూ...శాస్త్రవేత్తగా,దార్శనికుడిగా,ఉపాధ్యాయుడిగా, ఆదర్శ రాష్ట్రపతిగా భారతదేశ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన గొప్ప వ్యక్తిత్వం అబ్దుల్ కలాంది. ప్రతి సంవత్సరం జూలై 27న ఆయన వర్ధంతిని దేశమంతా గౌరవంగా నిర్వహిస్తూ ఆయన సేవలను స్మరించుకుంటుంది. ఆయన జీవితం ఒక వ్యక్తి కష్టపడితే ఎంతటి ఉన్నత శిఖరాలనైనా అధిరోహించగలడనే సత్యానికి నిలువెత్తు నిదర్శనం. చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, కృషి, నిజాయితీ, దేశభక్తి వంటి విలువలను అలవర్చుకున్నారు. అదే ఆయనను మహోన్నత వ్యక్తిగా తీర్చిదిద్దింది.

1958లో రక్షణ పరిశోధన సంస్థ (డిఆర్డిఓ)లో శాస్త్రవేత్తగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అనంతరం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లో చేరి భారత తొలి ఉపగ్రహ వాహక నౌక ఎస్‌ఎల్‌వీ--3 (ఎస్ఎల్వి-3) రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. 1980లో రోహిణీ ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టి భారత అంతరిక్ష చరిత్రలో స్వర్ణాక్షరాలతో నిలిచిపోయారని శివారెడ్డి అన్నారు.

**భారతదేశ శాస్త్ర--సాంకేతిక రంగానికి చేసిన సేవలు**

డాక్టర్ కలాం భారత రక్షణ రంగాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన మహనీయుడు. సమీకృత క్షిపణి అభివృద్ధి కార్యక్రమానికి నాయకత్వం వహించి అగ్ని, పృథ్వీ, ఆకాశ్, నాగ్, త్రిశూల్ వంటి క్షిపణుల అభివృద్ధికి విశేష కృషి చేశారు. అందుకే ప్రపంచం ఆయనను లి"మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా"లిగా గౌరవించింది.

1998లో జరిగిన పోఖ్రాన్--II అణు పరీక్షల విజయవంతంలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. రక్షణ, అంతరిక్ష, అణు సాంకేతిక రంగాల్లో ఆయన చేసిన సేవలు భారతదేశాన్ని స్వయం సమృద్ధి వైపు నడిపించాయి. భారత శాస్త్ర సాంకేతిక రంగానికి ఆయన అందించిన సేవలు యుగయుగాల పాటు చిరస్మరణీయంగా నిలుస్తాయి.

**రాష్ట్రపతిగా సేవలు --**

ప్రజల హృదయాలను గెలుచుకున్న నాయకుడు 2002లో భారతదేశ 11వ రాష్ట్రపతిగా ఎన్నికైన డాక్టర్ కలాం 2002 నుండి 2007 వరకు అత్యంత ప్రజాదరణ పొందిన రాష్ట్రపతిగా సేవలందించారు. అధికారాన్ని ఆర్భాటంగా కాకుండా బాధ్యతగా భావించారు. రాష్ట్రపతి భవన్‌ను ప్రజలకు మరింత చేరువ చేశారు. విద్యార్థులను తరచూ కలుసుకుంటూ వారి కలలకు రెక్కలు తొడిగారు. అందుకే ఆయనను "ప్రజల రాష్ట్రపతి" అని దేశం ప్రేమగా పిలిచింది. నాయకుడిగా, దార్శనికుడిగా చేసిన సేవలు డాక్టర్ కలాం రాజకీయ నాయకుడు కాకపోయినా నిజమైన జాతీయ నాయకుడు. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో "విజన్--2020" రూపకల్పన చేశారు. విజ్ఞానం, సాంకేతికత, విద్య, యువత శక్తి దేశాభివృద్ధికి మూలాధారాలని ఆయన విశ్వసించారు. దేశం కోసం కలలు కనే యువతను తయారు చేయడమే ఆయన జీవిత లక్ష్యంగా మారింది.

ప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్తగా, ఆవిష్కర్తగా, దేశభక్తుడిగా ఎదగాలని, భారత అత్యున్నత పౌర పురస్కారమైన భారత రత్న, పద్మభూషణ్, పద్మవిభూషణ్ వంటి ఎన్నో అత్యున్నత పురస్కారాలను అందుకున్నారని శివారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచంలోని అనేక విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లతో ఆయనను సత్కరించాయి.

జీవితాంతం తనను తాను ఒక ఉపాధ్యాయుడిగానే భావించిన మహనీయుడు, చివరి శ్వాస వరకు విద్యార్థులకు జ్ఞానాన్ని పంచుతూనే జీవితం ముగించడం ఎంతో విశిష్టమైన విషయం. దీర్ఘకాలం అనారోగ్యంతో ఇతరులను ఇబ్బంది పెట్టకుండా, తనకు అత్యంత ప్రియమైన బోధనా వేదికపైనే తుదిశ్వాస విడవడం ఒక మహనీయునికి దక్కిన అరుదైన గౌరవంగా ఎంతో మంది భావిస్తారు. ఆయన వర్ధంతి సందర్భంగా మనమందరం ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి, విజ్ఞానవంతమైన, సాంకేతికంగా శక్తివంతమైన, నైతిక విలువలతో కూడిన అభివృద్ధి భారతదేశ నిర్మాణానికి మన వంతు బాధ్యతను నిర్వర్తిద్దాం. అదే భారత రత్న డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం కి మనం సమర్పించే నిజమైన, శాశ్వతమైన నివాళి అని శివారెడ్డి ఉద్ఘాటించారు.

# విద్యార్థులకు నేల ఆరోగ్యంపై అవగాహన.. స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం నిర్వహణ





**అర్ధవీడు, జూలై 27 (జన సముద్రం న్యూస్)**

నేల ఆరోగ్య పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు అర్ధవీడు మండలంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం 'స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం'లిను మండల వ్యవసాయ అధికారి సజ్జా మనోహర్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేల ఆరోగ్యాన్ని కాపాడడం ద్వారా అధిక దిగుబడులతో పాటు సుస్థిర వ్యవసాయాన్ని సాధించవచ్చని తెలిపారు. మట్టి నమూనాలను శాస్త్రీయంగా సేకరించే విధానం, సాయిల్ హెల్త్ కార్డు వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు, ఎరువుల సమతుల్య వినియోగం, సేంద్రియ ఎరువుల ప్రాధాన్యత, సూక్ష్మ పోషకాల అవసరం, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై విద్యార్థులకు వివరించారు.

అనంతరం మట్టి నమూనాల సేకరణపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించి, సరైన పద్ధతిలో నమూనాలు ఎలా సేకరించాలో చూపించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, నేల ఆరోగ్యంపై చైతన్యం పెంపొందించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్, వ్యవసాయ విస్తరణ అధికారి (వి ఎ ఎ) ప్రసంగి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ అనుమానాస్పద మృతి

**చింతపల్లి, జూలై 27 (జనసముద్రం న్యూస్ ప్రతినిధి):**



చింతపల్లి మండలం గోడకొండ్ల మాల్ వెంకటేశ్వర నగర్‌లోని రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కార్యాలయ గదిలో మేనేజింగ్ డైరెక్టర్ ఎం.డి. ఖాజా నవాజ్ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై మృతుడి భార్య మహమ్మద్ షబానా చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, ఖాజా నవాజ్ కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురవుతున్నట్లు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆఫీస్ గదిలో ఖాజా నవాజ్ ఉరివేసుకున్న స్థితిలో కనిపించారని, దీనిని గమనించిన పాఠశాల సిబ్బంది వెంటనే ఆయన భార్య మహమ్మద్ షబానాకు చరవాణి ద్వారా సమాచారం అందించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకునే సమయానికే ఖాజా నవాజ్ మృతి చెందినట్లు గుర్తించినట్లు తెలిపారు.

సమాచారం అందుకున్న చింతపల్లి ఎస్సై ముత్యాల రామ్మూర్తి సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టామని, పోస్టుమార్టం నివేదికతో పాటు విచారణ అనంతరం మృతికి గల పూర్తి వివరాలను వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

Published by Rajeshwari Publications,D.No.4-3-99-1,Anantapur 515001 Rege: R.N.I.No APTEL/2021/16151 for Queries Contact us @ 94941 84136, janasamudram2021@gmail.com. Follow us on www.janasamudram.com,fb/janasamudram